# తీన్మార్

teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 22 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 25 జూన్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.


## నేడు ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

అధికారికంగా ప్రకటించిన ఉన్నత విద్యా మండలి



04

## బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న ముఠా అరెస్ట్



పోలీసుల అదుపులో నలుగురు ఇన్ఫ్లుయెన్సర్లు

పరారీలో ముగ్గురు ఒక్కరి సంపాదన రూ. 50 లక్షలు

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్న ముఠా పోలీసులకు చిక్కింది. కమీషన్లు ఆర్జిస్తున్న నలుగురు ఇన్ ఫ్ల్యూయెన్సర్లను

మిగతా 2 లో

## మిస్టర్ ఇండియా టైటిల్‌ను గెలుచుకున్న రాకేష్ ఆర్నె



హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణకు చెందిన రాకేష్ ఆర్నె దేశ స్థాయిలో ప్రతిభను చాటుతూ మిస్టర్ ఇండియా 2025 టైటిల్‌ను గెలుచుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవపేట మండలం ధర్పల్లి గ్రామానికి చెందిన రాకేష్, మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన

మిగతా 2 లో

## వేగం పుంజుకున్న ఇందిరమ్మ ఇండ్ల

# గ్రౌండింగ్ ప్రక్రియ

### ఇప్పటి వరకు దాదాపు 3 లక్షల ఇండ్లు మంజూరు



2.37 లక్షల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేత మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు దాదాపు 3 లక్షల ఇండ్లు మంజూరు చేయగా ఇందులో 2.37 లక్షల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను కూడా అందజేయడం జరిగిందన్నారు. 1.03 లక్షల ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 129 మంది

## మున్సిపల్ కమిషనర్ల బదిలీ

పురపాలక, పట్టణాభివృద్ధి కార్యదర్శి ఉత్తర్వులు జారీ

మునిసిపాలిటీల్లో పాలనాపరమైన మార్పులకు శ్రీకారం

.. వివరాలు 2లో



## బోనాల వేడుకల ఏర్పాట్లు ముమ్మరం

ఉత్సవాల ఏర్పాట్లపై ఇంచార్జ్ మంత్రి పొన్నం సమీక్ష

.. వివరాలు 2లో



## చాకలి ఐలమ్మ మునిమనవరాలు హత్య

ప్రాణాలు తీసిన కూతిరి ప్రేమ వ్యవహారం

నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

.. వివరాలు 2లో

## కాంగ్రెస్ పార్టీ వల్లే నా ఎదుగుదల సాధ్యమైంది

పార్టీ బాధ్యత మోసిన వారికే ప్రభుత్వంలో భాగస్వామ్యం

పీఏసీ మీటింగ్ లో సీఎం రేవంత్ రెడ్డి వాఖ్యలు



హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే కచ్చితంగా పదవులు వస్తాయని ఇప్పుడున్న చాలా మంది నేతలు కింది స్థాయి నుంచి వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే నా ఎదుగుదల సాధ్యమైందని పార్టీ బాధ్యత మోసిన వారికే ప్రభుత్వంలో

మిగతా 2 లో



## ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి క్యాట్ శుభవార్త

ఏపీ నుంచి తిరిగి మళ్లీ తెలంగాణకు కేటాయింపు

.. వివరాలు 2లో

## బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఏపీ సీఎం మరోసారి కీలక వ్యాఖ్యలు

తెలంగాణలో నీళ్లపై రాజకీయం చేస్తున్నారు


ప్రజలకు అర్థమయ్యే రీతిలో మనం వివరించాలి

మంత్రులకు సీఎం చంద్రబాబు సూచనలు

తెలంగాణ బ్యూరో, జూన్ 24 (తీన్మార్ న్యూస్): బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మంత్రులతో సచివాలయం వేదికగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ



మిగతా 2 లో



## ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురైతే సమాచారం ఇవ్వండి

హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ ప్రజలకు విజ్ఞప్తి

ఆఫీసుకు రాకుండానే వాటికి వాట్సాప్ లో ఫొటోలు పంపండి

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగించి, నగరంలోని నీటి వనరులను రక్షించేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా నగరంలో ఎక్కడైనా నాలాలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు కబ్జాలకు

మిగతా 2 లో



02

## తెలంగాణ పోలీసులకు సర్టిఫికేట్ ఆఫ్ రికగ్నిషన్ ప్రధానం

పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియ నేపథ్యంలో ప్రధానం

దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో

## లికించదగ్గ రోజు

70 లక్షల రైతులకు 9రోజుల్లో రూ. తొమ్మిది వేల కోట్లు

రైతు భరోసా విజయోత్సవ సభలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లికించదగ్గ రోజు, మంగళవారం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 70 లక్షల మంది రైతులకు తొమ్మిది రోజుల్లో రూ. తొమ్మిది వేల కోట్లు వారి ఖాతాల్లో వేశామని గుర్తు చేశారు. రైతు భరోసా విజయోత్సవ సభలో

మిగతా 2 లో



02

## ఇక్ఫై ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం

30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం

# వేగం పుంజుకున్న ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ



హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు దాదాపు 3 లక్షల ఇండ్లు మంజూరు చేయగా ఇందులో 2.37 లక్షల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను కూడా అందజేయడం జరిగిందన్నారు. 1.03 లక్షల ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈనెల 23వ తేదీ వరకు గ్రేటర్ హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) మినహా రాష్ట్రంలోని 95 నియోజకవర్గాలకుగాను 88 నియోజకవర్గాలలో లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ పూర్తయిందని, వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని గ్రౌండింగైన ఇండ్లను వీలైనంత త్వరగా బేస్మెంట్ పనులు పూర్తి చేసుకునేలా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులకు సూచించారు. ఇండ్ల మంజూరు, గ్రౌండింగ్‌లో సూర్యాపేట, పెద్దపల్లి, భూపాలపల్లి, హనుమకొండ, వికారాబాద్, సిద్దిపేట, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల పనితీరు మరింత మెరుగు పడాలని, తక్షణమే ఆయా జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఒక్కో ఇంటి కోసం 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తోందని ఈ ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో లబ్ధిదారులు పొందే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని బట్టి లబ్ధిదారులకు ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నాలుగు విడతల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలోని జమ చేస్తున్నామని తెలిపారు. బేస్మెంట్ పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత 1.25 లక్షలు, స్లాబ్ పూర్తయిన తర్వాత 1.75 లక్షలు, మిగిలిన పనులు పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు విడుదల చేస్తున్నామని తెలిపారు. ఇంటి స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటివరకు కేటాయించని 2BHK ఇండ్లను కేటాయించాలని, అలాగే మొండి గోడలతో ఉన్న 2BHK ఇండ్లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే పూర్తి చేసుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ప్రధానంగా 2BHK అసంపూర్తిగా ఉన్న జీహెచ్ఎంసీ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

# బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న ముఠా అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

సైబరాబాద్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. టెలిగ్రామ్, ఇన్ స్టాగ్రామ్ లో మ్లొ నిందితులు బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్నట్టు గుర్తించారు. నిందితులకు 10వేల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. బెట్టింగ్ వల్ల ఓ యువకుడు నష్టపోయి సూసైడ్ చేసుకున్నాడు. కమీషన్ తో ఒక్కొక్కరు రూ.50ల క్షలు సంపాదించినట్టు గుర్తించారు. 2019 నుంచి వీరు బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేస్తున్నారు. 10 విదేశీ వెబ్ సైట్లను నిందితులు ప్రమోట్ చేస్తున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నాం అన్నారు డిసీసీ సాయి శ్రీ. ఆన్ లైన్ బెట్టింగ్ బెట్టింగ్ ను ప్రోత్సహిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నట్టు డీసీపీ సాయి శ్రీ తెలిపారు. జూన్ 13న మియాపూర్ నివాసి ఇచ్చిన కంప్లయింట్ తో రంగంలోకి దిగిన పోలీసులు ముఠా గుట్టు రట్టు చేశారు. టెలిగ్రామ్ ఛానెల్ ద్వారా తనను , తన స్నేహితుడిని వరుసగా రూ.50 లక్షలు , రూ.60 లక్షలు మోసం చేశారని, 'టాస్ ఫిక్స్ హామీ ఇచ్చారని' అని బాధితుడు పోలీసులకు చెప్పారు. నిందితులు ఎవరికి చిక్కకుండా తెలివిగా డబ్బును క్రిప్టో కరెన్సీగా మార్చి మోసం చేస్తూ 13శాతం కమిషన్ తీసుకున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దందాతో - రూ. 80 లక్షలు అక్రమంగా సంపాదించినట్టు తెలిపారు. నిందితులు రాకేష్ రూ.1.7 కోట్లు, దీపక్ రూ.55 లక్షలు, నాయక్ రూ.30 లక్షలు, హేమంత్ రూ.20 లక్షల లాభం పొందారు. నిందితులు టెలిగ్రామ్ ఖాతాలను సృష్టించి క్రికెట్ మ్యాచ్‌లపై ప్రత్యేకమైన ఇన్‌సైడర్ చిట్కాలను అందిస్తూ ఫిక్స్డ్ మ్యాచ్‌లను యాక్సెస్ చేసేవారని పోలీసులు తెలిపారు. బాధితులు మ్యాచ్‌లపై పందెం కాస్తే UPI ద్వారా మ్యూల్ ఖాతాలకు డబ్బును బదిలీ చేయమని అడిగారు. నకిలీ ఆధార్ ,పాన్ కార్డులను ఉపయోగించి ఈ ఖాతాలను తెరిచారని పోలీసులు తెలిపారు.

# చాకలి ఐలమ్మ మునిమనవరాలు హత్య

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): మానవ సంబంధాలు మంటగలిసిపోతున్నాయి. చదువుకోవాల్సిన వయసులో యువత పెడతోవన వెళుతూ కన్నోళ్ల ప్రాణాలను తీస్తున్నారు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ పరిధిలోని జీడిమెట్లలో తల్లికూతుళ్లు ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. అయితే, 10 తరగతి చదువుతోన్న తేజశ్రీ (16)కి నల్లగొండకు చెందిన పగిల్ల శివ (19) అనే యువకుడితో 8 నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. రాను రాను ఆ పరిచయం కాస్తా ప్రేమకు దారి తీసింది. అయితే, విషయం తల్లి అంజలికి తెలియడంతో చదువుకోవాల్సిన వయసులో ఈ ప్రేమలు ఏంటని ఇద్దరిని మందలించింది. దీంతో తమ ప్రేమకు అడ్డుగా ఉన్న తల్లి అంజలిని ఎలాగైనా అంతమొందించాలని శివ, తేజశ్రీ ప్లాన్ వేశారు. సోమవారం సాయంత్రం నల్గొండ నుంచి వచ్చిన ప్రియుడు శివ, తేజశ్రీ ఇంటికి వెళ్లి పూజ చేస్తున్న అంజలిపై వెనుక నుంచి దాడి చేశాడు. అనంతరం బెడ్‌షీట్‌తో అంజలి ముఖాన్ని కప్పగా తల్లి అని చూడకుండా కుమార్తె తేజశ్రీ ఆమె తలపై సుత్తితో బలంగా బాదింది. అయినా అంజలి ప్రాణం పోకపోవడంతో ఆమె పీకను శివ తమ్ముడు యశ్వంత్ కిరాతకంగా కత్తితో కోసేశాడు. స్థానికుల ఫిర్యాదుతో జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అయితే, చనిపోయిన అంజలి ఎవరో కాదు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చాకలి ఐలమ్మకు స్వయానా మునిమనవరాలు. తేజశ్రీ తల్లి అంజలి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఫోక్ సింగర్‌గా ఉన్నారు. ఆమె స్వగ్రామం తొర్రూరు దగ్గర ఇనుగుర్తి. కూతురే తల్లిని ఇలా దారుణంగా చంపేయడంతో ఆ కళా బృందంలో సభ్యులంతా ఇప్పుడు షాక్‌లో ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ వల్లే నా ఎదుగుదల సాధ్యమైంది



మొదటి పేజీ తరువాయి

భాగస్వామ్యం ఉంటుందన్నారు. మంగళవారం గాంధీభవన్ లో పీఏసీ మీటింగ్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ రచించిన 'విధ్వంసం నుంచి వికాసం వైపు' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఎంతో మంది పదవుల కోసం పోటీ పడ్డారన్నారు. మీరంతా పార్టీ నిర్మాణంలో కీలక భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. మన ప్రభుత్వం అనేక సక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, ఈ దేశంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. కార్యకర్తల ఎన్నికలు (స్థానిక సంస్థల ఎన్నికలు) రాబోతున్నాయి. మన కార్యకర్తలను కష్టపడి గెలిపించుకోవాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్తాయిలో పని చేయాల్సిందేనని పార్టీ నిర్మాణంలో కార్యకర్తలుక్రియాశీల పాత్ర పోషించాలన్నారు. పార్టీ కోసం పని చేయనివాళ్లను ఎన్నికల ముందు బాధ్యతల నుంచి తప్పిస్తామని హెచ్చరించారు.

**పదేళ్లు నాదే బాధ్యత:**

ఉమ్మడి రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు టీడీపీ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని సీఎం చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలో ఉందని 2023 నుంచి 2033 వరకు పదేళ్లు కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలో ఉండబోతున్నదన్నారు. ఈ పదేళ్లు పార్టీ కోసం పని చేసే వారిని కాపాడుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. పదేళ్లు అధికారం నడిపించే వరకు నేను బాధ్యత తీసుకుంటా. ఆ తర్వాత పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి నడిపించాల్సిన బాధ్యత పార్టీలోని యువతరం తీసుకోవాలని చెప్పారు. రెండోసారి అధికారంలోకి రావడం కార్యకర్తల చేతుల్లో ఉందని, ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు అందుబాటులోకి తేవాలన్నారు. పార్టీ పదవులను చిన్నచూపు చూడవద్దని ఈ పార్టీ పదవులే మిమ్మల్నీ పెద్ద నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. కులగణన చేసి మోడీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతో పాటు కలగణన చేసే పరిస్థితి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. త్వరలో డీలిమిటేషన్ జరగబోతున్నదని సీట్లు పెరగబోతున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయి. జమిలీ ఎన్నికలు తేస్తామని చెబుతున్నారని ఆ సమయానికి మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ 18 నెలలో గోల్డెన్ పీరియడ్ అని అన్నారు.


# మిస్టర్ ఇండియా టైటిల్‌ను గెలుచుకున్న రాకేష్ ఆర్నె



మొదటి పేజీ తరువాయి

మీడియా సమావేశంలో తన విజయం వెనకున్న ప్రయాణాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ, "నా విజయానికి మూలం నిరంతర కృషి, పట్టుదల, కుటుంబం మరియు మిత్రుల సహకారం" అని అన్నారు. మిస్టర్ ఇండియా పోటీలకు తాను తన ఫిట్‌నెస్, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహనతో సన్నద్ధం అయ్యానని వివరించారు. ఇప్పుడు తన తదుపరి లక్ష్యం మిస్టర్ ఎలైట్ గ్లోబల్ పోటీల్లో భారత్‌ను ప్రతినిధ్యం వహించడం అని తెలిపారు. "ఫిట్‌నెస్ అనేది కేవలం శారీరక పరిమితులకే కాదు, మానసికంగా కూడ చాలా అవసరం. ఈ దిశగా యువతలో అవగాహన పెంచేందుకు త్వరలోనే శిక్షణా క్యాంపులు , ఫిట్‌నెస్ వర్క్‌షాపులు నిర్వహిస్తాను" అని చెప్పారు. తెలంగాణ నుంచి ప్రపంచ వేదికపై భారత జెండాను ఎగరవేయడమే తన దీర్ఘకాలిక లక్ష్యమని రాకేష్ ఆర్నె ఆత్మవిశ్వాసంగా పేర్కొన్నారు.

# ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురైతే సమాచారం ఇవ్వండి




మొదటి పేజీ తరువాయి

గురైతే వాటి సమాచారం అందజేయాలని హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నేరుగా హైడ్రా ఆఫీసుకు రాకుండానే వాటికి సంబంధించిన ఫొటోలు, లొకేషన్ వివరాలను వాట్సాప్ నంబర్ 8712406899కు పంపాలని కోరారు. కాగా నగరంలో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ ద్వారా వరద నీటిని రోడ్లు, నివాస ప్రాంతాల్లోకి చేరకుండా నేరుగా చెరువుల్లోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. జూలై 19, 2024న హైడ్రా ఏర్పడినప్పటి నుంచి భారీగా ఆక్రమణలను తొలగించి, పదుల ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో 1979-2023 మధ్య 61% చెరువుల విస్తీర్ణం కోల్పోయామని, ప్రస్తుతం హైడ్రా చేపడుతున్న పునరుద్ధరణ చర్యలు చెరువులు, కుంటలు, జీవవైవిధ్య రక్షణ, వరద నివారణలో కీలక పాత్ర పోషిస్తాయని రంగనాథ్ వెల్లడించారు.

# ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి క్యాట్ శుభవార్త

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి క్యాట్ శుభవార్త చెప్పింది. ఏపీ నుంచి తిరిగి మళ్లీ తెలంగాణకు కేటాయించింది. ఈ మేరకు మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కొన్నినెలల క్రితం ఏపీ, తెలంగాణ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. తమను తెలంగాణకే కేటాయించాలన్న పలువురి అభ్యంతరాలనూ తోసిపుచ్చింది. కేంద్రం ఆదేశాలతో తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి కాట, రొనాల్డ్ రోస్, వాకాటి కరుణ, వాణీప్రసాద్, ప్రశాంతి ఏపీలో విధులు నిర్వర్తించారు. తాజాగా మళ్లీ ఆమ్రపాలిని తెలంగాణకు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో ఆమ్రపాలి కాట గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు.

# బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఏపీ సీఎం మరోసారి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

పోలవరం బనకచర్లపై తెలంగాణ వాళ్లు అందరూ ఏకమై మాట్లాడుతున్నారు. మనం కూడా మన వాదన వినిపించాలని మంత్రులకు సూచించారు. తెలంగాణలో వాళ్లు అనుమతి లేని ప్రాజెక్టులు ఎన్నో కడుతున్నారు. వాళ్లు వాడుకోగా మిగిలిన నీళ్లే మనం వాడుకుంటున్నాం. ఈ విషయాన్ని రెండు రాష్ట్రాల ప్రజలకు క్లియర్‌గా అర్థం చేయించాలి. ఈ అంశాన్ని వాళ్లు రాజకీయం చేస్తున్నారు. దానికి ముందే మనం ప్రజలకు అర్థమయ్యే రీతిలో మనం వివరించాలని మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. మరోవైపు. బనకచర్ల ప్రాజెక్టుపై ఏ విధంగా ముందుకెళ్లాలనే విషయమై సోమవారం నిర్వహించిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్ట్‌ను అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. అడ్డుకొని తీరాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఆంధ్రప్రదేశ్‌సర్కార్ వ్యవహరిస్తున్నదని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# ఇఫ్కీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం



హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): భావితరాల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని 'ఇఫ్కీ' ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. మంగళవారం అంబేడ్కర్ సచివాలయంలో ఇఫ్కీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం తరఫున అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే దూరదృష్టితోనే సీఎం రేవంత్ రెడ్డి 30 వేల ఎకరాల్లో పీపీపీ విధానంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఈ నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నదే మా సంకల్పమని వివరించారు. ఏడాదిన్నర వ్యవధిలోనే తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టబడులొచ్చాయన్నారు. గతేడాది హైదరాబాద్ లో 70 జీసీసీలు ప్రారంభమయ్యాని, పారిశ్రామికవేత్తలకు మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమని చెప్పారు. 'ఏరో స్పేస్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ లాంటి రంగాల్లో పలు ఫ్రెంచ్ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టాయన్నారు. సనోఫి, మోనిన్, సఫ్రాన్, క్యాప్ జెమినీ, దసాల్ట్, టెలి పర్ఫార్మెన్స్, ఓపెల్లా హెల్త్ కేర్ లాంటి దిగ్గజ సంస్థలు తమ కార్యకలాపాలను ఇక్కడ నిర్వహిస్తున్నాయని అన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, డిజిటల్ గవర్నెన్స్, ఆగ్రో ఇన్నోవేషన్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, ఫ్యూచర్ రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మ్యానుఫాక్చరింగ్ తదితర రంగాల్లో మంచి అవకాశాలున్నాయని, దీన్ని ఫ్రాన్స్ పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని ఇఫ్కీ ప్రతినిధులను కోరారు. 'తెలంగాణ - ఫ్రెంచ్' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లికించదగ్గ రోజు

మొదటి పేజీ తరువాయి

ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు త్యాగాలు చేసిన మహాను భావుడు రాజీవ్ గాంధీ అన్నారు. వ్యవసాయం అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే వ్యవసాయమని తెలిపారు. రైతులకు మద్దతు ధర ఇచ్చింది కాంగ్రెస్, రైతులకు నిధులు ఇవ్వాలని చెప్పింది కాంగ్రెస్ దేశంలో గ్రీన్ రెవల్యూషన్ తెచ్చింది కాంగ్రెస్ అని చెప్పారు. రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని భూమి లేని నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని చెప్పామన్నారు. రైతులకోసం బీఆర్ఎస్ ఏమీ చేయలేదని రైతులకు ఇవ్వాల్సిన అన్నింటినీ బంద్ చేసిందని విమర్శించారు. రైతు బంధు పేరుతో అరకొర నిధులు వేశారని ఆరోపించారు. చెప్పిన మాట ప్రకారం తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా ఇచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని రైతులు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. సంక్షోభం నుంచి సంక్షేమం వైపు వెళ్తున్నాము. ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. రాజీవ్ గాంధీ సూచనల మేరకు ముందుకు వెళ్తున్నాము. కొంతమంది కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు. 25 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు ఇతర పార్టీలకు లేదు. నాడు మన్మోహన్ సింగ్ చేశారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం చేసింది. అప్పటి ప్రభుత్వాలు నెలల తరబడి రైతుబంధు అన్నారు. పూర్తిగా కూడా చేయలేదు. తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా వేశాము. కష్టాలు, ఇబ్బందులు ఉన్నా నిధులు విడుదల చేశాం. పాత పథకాలు ఏవీ తీసివేయలేదు. గ్రామీణ తెలంగాణ మా గుండెల్లో ఉంటుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్ష కోట్లు రైతులకు ఖర్చు చేశాం. మాకు ప్రజలు ఐదు సంవత్సరాలు ప్రజలు సమయం ఇచ్చారు. మేము ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి ప్రజల ముందుకు వెళతాం. అని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా 129 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

## పురపాలక, పట్టణాభివృద్ధి కార్యదర్శి ఉత్తర్వులు జారీ

## మునిసిపాలిటీల్లో పాలనాపరమైన మార్పులకు శ్రీకారం

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. మునిసిపాలిటీల్లో పాలనాపరమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 129 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి కార్యదర్శి టీకే శ్రీదేవి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని వెల్లడించారు. బదిలీ అయిన వారిలో కొందరు పదోన్నతులు పొందగా మరికొందరు వారి పనితీరు బాగోలేక ట్రాన్స్‌ఫర్ అయినట్లుగా తెలుస్తోంది.

# బోనాల వేడుకల ఏర్పాట్లు ముమ్మరం

హైదరాబాద్, జూన్ 24 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం బోనాల వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. వచ్చే నెల 13న సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయ బోనాల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించబోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మంత్రితో పాటు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బోనాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఎంత పెద్ద కార్యక్రమాలు చేపట్టినా ప్రజల సహకారం లేకపోతే అవి విజయవంతం కావని అన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పాత కేబుళ్ల స్థానంలో కొత్త కేబుళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రత విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమాలు ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని అన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణ పోలీసులకు సర్టిఫికేట్ ఆఫ్ రికగ్నిషన్ ప్రధానం

తెలంగాణ బ్యూరో, జూన్ 24 (తీన్మార్ న్యూస్): 2024-25 ఆర్థిక సంవత్సరానికి పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినందుకు గుర్తింపుగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలంగాణ పోలీసులకు సర్టిఫికేట్ ఆఫ్ రికగ్నిషన్ ను ప్రదానం చేసింది. జూలై 24, 2024న న్యూఢిల్లీలో జరిగిన పాస్‌పోర్ట్ సేవా దివస్ కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రాన్ని తెలంగాణ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ బి. శివధర్ రెడ్డి ఐపీఎస్ స్వీకరించారు. విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా హాజరై గుర్తింపు పత్రాన్ని అందించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 8,06,684 పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణను తెలంగాణ పోలీసులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ధృవీకరణలు పూర్తిగా నిర్ణీత వ్యవధి (15 రోజులలోపు) పూర్తయ్యాయి. వాస్తవానికి, తెలంగాణలో పాస్‌పోర్ట్ ధృవీకరణలకు తీసుకున్న సగటు సమయం 7 రోజులకు కూడా తగ్గిందనే ప్రశంసనీయమైన ఘనతను సాధించారు. ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి, ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, తెలంగాణ పోలీసులు స్వయంగా అభివృద్ధి చేసిన 'సత్యాపన్', 'వెరిఫాస్ట్' సాఫ్ట్‌వేర్‌లు కీలక పాత్ర పోషించాయి. ఫేస్ రికగ్నిషన్, డేటా మ్యాచింగ్ టెక్నాలజీలతో కూడిన ఈ సిస్టమ్‌లు సీసీటీఎన్ఎస్, పాత పాస్‌పోర్ట్ దరఖాస్తు డేటా, ఇతర డేటాబేస్‌లతో సరిపోల్చడం ద్వారా దరఖాస్తుదారులకు ఏమైనా నేరచరిత్ర ఉంటే త్వరగా గుర్తించగలుగుతున్నాయి. 2014 నుంచి ఇప్పటి వరకు ఆరుసార్లు తెలంగాణ పోలీసుశాఖ ఈ విషయంలో ఉత్తమ ప్రదర్శన కలిగిన రాష్ట్రాల జాబితాలో స్థానం దక్కించుకోవడం గర్వకారణం. ఇది పబ్లిక్ సర్వీసు పట్ల పోలీసుశాఖ చూపిన నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ మేరకు, 2024-25లో తెలంగాణ పోలీసులకు లభించిన ఈ జాతీయ గుర్తింపుపై, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్ని యూనిట్ల అధికారులను, ప్రత్యేక బ్రాంచ్ అధికారులను, సంబంధిత సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. పౌరులకు వేగవంతమైన, పారదర్శకమైన, అవినీతి రహిత సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్రం మూడు ప్రధాన లక్ష్యాలపై దృష్టి సారించింది. అవేంటంటే 1. ఫూల్ ప్రూఫ్ వెరిఫికేషన్ 2. సకాలంలో అప్లికేషన్ల పరిష్కారం 3. పూర్తిగా అవినీతిరహిత విధానం

# లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

### ప్రాధాన్యత రంగాలల్లో రుణాల పంపిణీ మరింత పెంచాలి

### బ్యాంకర్లతో డీసీసీ డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించిన కలెక్టర్



వరంగల్ జిల్లా, జూన్ 24 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు తోడ్పాటు అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ మంగళవారం బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో (మార్చి 2015 చివరి వరకు) సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ ద్వారా 2025-26 సం. రానికి సంబంధించి వరంగల్ జిల్లా అన్నువల్ క్రెడిట్ ప్లాన్ కింద రూ.9274.25 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వం యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెంపొందించేందుకు కృషిచేస్తున్నదని, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల ఏర్పాటులో సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలు తగ్గకుండా చూడాలని, జిల్లాలోని అన్ని గ్రామాల్లో ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు.జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో జిల్లా యంత్రాంగం ద్వారా స్ఫూర్తి కార్యక్రమం 5వ తరగతి నుండి డిగ్రీ చదివే విద్యార్థులకు ప్రతి వారం నిర్వహిస్తున్నామని, అందులో బ్యాంకర్లు భాగస్వాములై విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. పీఎం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ క్రింద ఎస్టీ ప్రాంతాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు అవగాహన, నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను కోరారు. అనంతరం కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో పంట రుణాలకు గాను రూ. 1802.08 కోట్ల రూపాయలు రైతులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.1702 కోట్ల రూపాయలు అందించినట్లు వివరించారు. వ్యవసాయ రంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3785.18 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకోగా రూ.3653 కోట్లు అందించినట్టు తెలిపారు. భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 997.63 కోట్ల రూపాయలకు గాను రూ. 1486 కోట్లు, ప్రాధాన్యత ఉన్న రంగాలకు రూ. 4891.15 కోట్లకు గాను రూ. 5347 కోట్లు అందించినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 628 కోట్లకు గాను రూ. 868 కోట్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు. 28354 పరిశ్రమ యూనిట్లకు 288 కోట్లు ముద్ర రుణాలు అందించినట్లు తెలిపారు.532 విద్యార్థులకు రూ .47 కోట్ల విద్యా రుణాలు అందించినట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల పథకం (ఏఐ ఎఫ్) క్రింద 90 యూనిట్లకు గాను రూ. 126 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పీఎం ఈజీపి, పీఎం ఎఫ్ ఎం ఈ, స్టాండ్ అప్ ఇండియా, నిర్దేశిత లక్ష్యాలను సాధించినట్లు కలెక్టర్ అన్నారు. సామాజిక భద్రత పథకంలో భాగంగా పి ఎం జీవన్ జ్యోతి పథకంలో నామినికి రూ 2 లక్షల యూబీ ఐ వరంగల్ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కన్వీనర్ ఎల్డీఎం యూబీఐ హావేలి రాజు, యూనియన్ బ్యాంకు ఆర్ హెచ్ కమలాకర్, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్, నాబార్డ్ ఏజీఎం చైతన్య రవి, బ్యాంకర్ రవి , వ్యవసాయ అధికారి అనురాధ , పశుసంవర్ధక శాఖ బాలకృష్ణ , జిల్లా ఎస్సి కార్పొరేషన్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రంగా.. భూగర్భ జలాలు

### స్పెషల్ డ్రైవ్ తో జనగామ లో జల నిధి

### మన జిల్లా మన నీరు పోస్టర్ ఆవిష్కరణ

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, జూన్ 24 (తీన్మార్ న్యూస్): భూగర్భ జిల్లా వనరుల సంరక్షణకు జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లుగా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతల నిర్మాణం, మ్యాజిక్ సోక్ పిట్స్, ఫారామ్ పాండ్ నిర్మాణాలకు సంబందించిన పోస్టర్ ని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హల్ లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ ద్వారా స్పెషల్ డ్రైవ్ ని చేపట్టి జిల్లా లో భూగర్భ జలాలను పెంపోందిస్తున్నమన్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటగా జిల్లా కలెక్టరెట్ లో ఇంకుడు గుంత నిర్మాణం ప్రారంభించామన్నారు. జిల్లాలోని ప్రతీ ఇంటిలో ఇంకుడు గుంత నిర్మాణం ఉండాలన్నారు. వాటితో పాటు మ్యాజిక్ సోక్ పిట్స్, ఫారామ్ పాండ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రాక్చర్, బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రాక్చర్ లు ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులు కూడా వారి పరిధిలో భూగర్భ జలాల సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను సంరక్షించడంతోపాటు ప్రతీ నీటి బొట్టు వృధా కాకుండా చుస్తే భవిష్యత్ లో మనకు నీటి కొరత ఉ ండదన్నారు.

# ములుకనూరు ఎరువుల గోదాంను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ జిల్లా, జూన్ 24 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదాం ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మంగళవారం పరిశీలించారు. గోదాంలోని ఎరువుల బస్తాలు, యూరియా బస్తాలు, ఇతర ఎరువులను కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలు అని అడిగి తెలుసుకున్నారు. ఎరువులకు సంబంధించిన క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసిన కలెక్టర్ ఇప్పటివరకు ఈ సీజన్లో ఎంత ఎరువులు అమ్ముడయ్యాయని, ఇంకా ఎంత మొత్తం స్టాక్ ఉందని, నిర్వహణ చేస్తున్న తీరు, గత సంవత్సరంలో ఎరువుల క్రయవిక్రయాలు, ఈ గోదాం నుండి ఎరువులను ఎక్కడెక్కడికి తీసుకెళ్తారని వివరాలను వ్యవసాయ అధికారులతో పాటు గోదాం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్ లో ఎరువుల విక్రయాలు సాఫీగా నిర్వహించాలని, ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, స్థానిక తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలి

### రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు

### ప్రతి పట్టణంలో కనీసం 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

### డబుల్ బెడ్ రూం ఇండ్లను లబ్దిదారుల ద్వారా పూర్తి చేయాలి


### రైతులకు సమృద్ధిగా ఎరువుల సరఫరాకు పకడ్బందీ చర్యలు

### లక్షా 25 వేల ఎకరాల ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణ లక్ష్యంగా చర్యలు

### ఆగస్టు 15 నాటికి భూ భారతి రెవెన్యూ సదస్సుల క్రింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారం

### ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 24 (తీన్మార్ న్యూస్): ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సి.ఎస్ కే.రామ కృష్ణా రావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్ లైన్ నుంచి అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కోండా సురేఖ హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా జితేష్ వి.పాటిల్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ మరియు ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలసి ఐ డి ఓ సి కార్యాలయం నుంచి పాల్గొన్నారు. వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాల పై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు మాట్లాడుతూ 2 లక్షల 30 వేల కు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. పెద్ద వర్షాలు కురవడానికి ముందే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సీఎస్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజి చార్జిలను ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంత మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 క్రింద మనకు లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్ లకు సూచించారు. ప్రతి జిల్లా ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కో-ఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రోక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. రిటైల్ విక్రయాలను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల షాప్ వద్ద ఎక్కడ కొరత రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ప్రస్తుత సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. డెంగ్యూ, మల్లేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి పలు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వల్నరబుల్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి లక్షణాలు గల ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు. ఆన్ లైన్ నుంచి వీసి లో పాల్గోన్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గోన్నాలని అన్నారు. గతం కంటే మెరుగ్గా ప్రజల్లో వన మహోత్సవం కార్యక్రమం తీసుకుని వెళ్ళాలని, ప్రతి రోజూ ఒక్కో శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వసించాలని అన్నారు. జిల్లాలో వి.ఐ.పి పర్యటనల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పరిధిలో ఎత్తైన మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అటవీ ప్రాంతంలో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున బ్లాక్ ప్లాంటేషన్ పెంచాలని అన్నారు. జిల్లాలకు కేటాయించిన వన మహోత్సవం లక్ష్యాలను కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ 58345 దరఖాస్తులను భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించామని,దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేసి, దరఖాస్తులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆగస్టు 15 నాటికి ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టామని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా 70 లక్షల మొక్కలను నాటేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వివరించారు. వనమహోత్సవం లో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేసేలా విస్తృత ప్రచారం కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదరపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, జిల్లా ఉ ద్యానవన శాఖ అధికారి కిషోర్,మరియు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ గ్రామపంచాయతీ గుర్తింపు కోసం పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్




ములుగు జిల్లా, జూన్ 24 (తీన్మార్ న్యూస్): ఎస్ ఎస్ జి సర్వేకు సంబంధించిన ఉత్తమ గ్రామపంచాయతీలుగా గుర్తింపు పొందడానికి గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టడమే కాకుండా 100 శాతం మరుగుదొడ్లను ప్రజలు వినియోగించుకునేలా గ్రామపంచాయతీ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ సంపత్ రావుతో కలిసి స్వచ్ సర్వేక్షన్ 2025 వాల్ పోస్టర్లనుఆవిష్కరించి, గ్రామ పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఎస్ జి 2025 గాను వెయ్యి మార్కులకు 540 మార్కులు సాధించడానికి ఎంపీడీవోలు, ఎంఈఓ లు, గ్రామ కార్యదర్శులు ప్రతి గ్రామంలో వంద శాతం మరుగుదొడ్లు ఉండేటట్లు చూసుకోవాలని, ప్రతి గ్రామాన్ని, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రజలు సంచరించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రతి చోట ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలను చైతన్యం చేయడానికి గోడలపై వాల్ పెయింట్ వేయించాలని ఆదేశించారు. ఎస్ఎస్ జి 2025 సర్వే పురస్కరించుకొని జిల్లాలకు ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతుందని, ప్రతి గ్రామాన్ని మంచి పరిశుభ్రతను పాటించే విధంగా కృషి చేస్తూ అవార్డు పొందేలా చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ దేవరాజు, డిప్యూటీ సి ఈ ఓ రాజు, ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, జూన్ 24 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి వేగంగా భాగ్యం అందించాలని సూచించారు. హాస్పిటల్ లోని మెడికల్, ఫీవర్, క్యాజువాలిటీ, ఐసీయూ, మెడికల్ కేర్, పిరియాడిటిక్ , జనరల్ సర్జికల్ వార్డు, మెడికల్ స్టోర్, డయాలసిస్, తదితర వార్డులను సందర్శించి చికిత్స పొందుతున్న పేషెంట్ ద్రవిడ్, ఆలన సెంటర్ లో క్యాన్సర్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ అవుట్ పేషెంట్, హెూమ్ కేర్ లు తదితరులతో మాట్లాడారు వారికి అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్లో కావలసిన అన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు, పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం సానిటేషన్ నిర్వహించాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ హస్పటల్, మెడికల్ కాలేజ్ స్థితిగతులను తెలుసుకున్నారు. పనులను వేగంగా పూర్తి చేయాలని అందుకు ప్రతినిత్యం కాంట్రాక్టర్లు సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పేషెంట్లకు నిత్యం వైద్య సేవలు అందిస్తూ షిఫ్టులవారీగా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్య సేవలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, తదితరులు ఉన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ దేయం

## రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు, జూన్ 24 (తీన్మార్ న్యూస్): వనపర్తి ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి ఆదేశాల మేరకు నేడు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.రైతుల సంక్షేమం కోసం ఎన్నడూ లేని విధంగా రైతు రుణమాఫీ,వరి ధాన్యానికి బోనస్ మరియు రైతు భరోసా వంటి కార్యక్రమాలను చేపట్టి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో తొమ్మిది వేల కోట్ల పైకి లకు రైతు భరోసా రైతు ఖాతాల్లో జమ చేశామని రైతు నేస్తం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో నేరుగా ముఖాముఖిలో పాల్గొన్న కార్యక్రమంలో కంచిరావు పల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పెబ్బేరు మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, డైరెక్టర్ బత్తుల కవిత కోటి గౌడ్,కిసాన్ సెల్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, పెబ్బేరు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కారుపాకుల వెంకట రాములు యాదవ్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాపార్ల రామ్ రెడ్డి, దయాకర్ రెడ్డి, నరేందర్, గుమ్మడం రామ్ రెడ్డి, హరిబాబు, యూత్ ప్రెసిడెంట్ రాజేష్,కంచిరావు పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంధం రాములు, నాయకులు నీలవ రెడ్డి, సోమగౌడ్, బాలగౌడ్, గంధం సాయిప్రసాద్, శ్యామ్ సురేందర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.






# హమ్మయ్య యుద్ధం ముగిసింది!

ఇది యుద్ధాల కాలం. ఎవరు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తారో తలియని కాలమిది. ఉక్రెయిన్ రష్యాల మధ్య మాత్రం యుద్ధం ఇంకా కొనసాగుతోంది. గత నాలుగైదేళ్లుగా పరస్పరం ఆయుధాలతో తలపడుతూనే ఉన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీన మధ్య యుద్ధం నిరంతరంగా సాగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో భారత్‌లో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడి చేసింది. కానీ పాక్ ప్రతిగా ఇండియాపై దాడికి తెగించింది. దీంతో భారత్ ధీటుగా స్పందించి, పాక్ రెక్కలు విరిచింది. దీంతో దిక్కుతోచని పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. యుద్ధం ఆపాలన్న వినితపై మరోమాట లేకుండా భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. దీంతో జరగాల్సిన యుద్ధం ఆగిపోయింది. అయితే ఈ యుద్ధాన్ని తానే ఆపించానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భంగపాటు తప్పలేదు. కాల్పుల విరమణలో ట్రంప్ పాత్ర లేదని ప్రదాని మోడీ తేల్చేశారు. ఇకపోతే ఇది ముగిసిన కొన్నాళ్లకే ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడి చేసింది. ఇరాన్ కూడా ప్రతిదాడులతో తెగబడింది. చివరకు అమెరికా కూడా రంగంలోకి దిగి ఇరాన్‌పై ప్రతాపం చూపింది. చివరకు పక్షం రోజులకు కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఇక్కడా తానే యుద్ధాన్ని ఆపాలని కోరినట్లుగా ట్రంప్ ప్రకటించారు. మొత్తంగా పశ్చిమాసియాలో యద్ధభయం ముగిసింది. లేకుంటే చమురు ధరలపై విపరీత ప్రభావం పడేది. అలాగే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇది ప్రభవం చూపేది. ఆయుధ సంపత్తి కలిగిన దేశాలు తమ ఆయుధానలు పరీక్షించు కోవడానికి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నాయి. రష్యా దాడులు మాత్రం ఆపడంలేదు. ఉక్రెయిన మాదేనంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటన చేశాడు. నిజానికి ఆయా దేశాల నేతల యుద్ధకాంక్షల వల్ల సామాన్యులు నలిగిపోతున్నారు. పూర్వం కూడా రాజులు ఇలాగే నిరంతరంగా యుద్ధాలతో కాలం గడిపేవారు. రాజ్యాలను కొల్లగొట్టేవారు. ఇప్పుడు మరో రూపంలో సామ్రాజ్యవాదం కొనసాగుతోంది. తమ పెత్తనాన్ని అంగీకరించడం లేదన్న ఏకైక కారణంతో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి తెగించింది. ఇరాన్ అణ్వస్త్ర ప్రయోగాలు చేస్తోందన్న కారణంతో ఇజ్రాయిల్, అమెరికాలు దాడికి తెగించాయి. ఈ దాడలతో ఇరాన్‌కు జరగాల్సిన నష్టం జరిగింది. అయితే పెద్దన్న పాత్రను పదిలపర్చుకోవాలన్న అమెరికా ఈ తరహా దాడులను ప్రోత్సహించడం సరికాదు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో, పరోక్షంగా అన్నీతానై ఇజ్రాయెల్‌తో కథనడిపించిన అమెరికా, ప్రత్యక్షంగా దిగాలా వద్దా అన్న నిర్ణయాన్ని ఓ రెండువారాల్లో తీసుకుంటానని ట్రంప్ ప్రకటించాడు. జి7 సదస్సు నుంచి అర్థాంతరంగా అమెరికా చేరుకున్నారు. వచ్చీ రాగానే పథక రచన చేసి గత ఆదివారం ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో తనను తాను యుద్ధవ్యతిరేకిగా ప్రచారం చేసుకున్న ట్రంప్ స్వయంగా యుద్ధానికి సై అన్నాడు. అయితే ఇరాన్ దెబ్బతినడంతో ఇక లాభం లేదనుకుని యుద్ధాన్ని ముగిస్తున్నట్లుగా ప్రకటించారు. అమెరికా నిరంతర యుద్ధాల్లో మునిగితేలడంతో ప్రపంచంలో అశాంతి చెలరేగిందంటూ ఆరోపిస్తూ వచ్చిన ట్రంప్ , తాను అధికారంలోకి రాగానే అన్ని యుద్ధాలనీ ఆపేసి ప్రపంచానికి శాంతినిస్తానన్నాడు. ఆర్నెల్లకాలంలోనే ఆయన తన అసలు రంగును బయటపెట్టాడు. ఆదివారం తెల్లవారుజామున ఏడు బి2 స్పిరిట్ బాంబర్లు ఇరాన్‌లోకి ప్రవేశించి, మూడు అణుస్థావరాలమీద బంకర్ బస్టర్ బాంబులు కురిపించాయి. ఇజ్రాయెల్ చేద్దామనుకున్న పనిని తానే స్వయంగా పూర్తిచేశారు. ఫర్డో, నతాంజ్ పాటు, శుద్ధిచేసిన యురేనియంను భారీ ఎత్తున నిల్వచేసిన ఇసఫహాన్ అణుకేంద్రాన్ని నాశనం చేయడానికి అదనంగా సబ్‌మెరైన్లనుంచి ప్రయోగించిన టామాహాక్ క్రూయిజ్‌మిసైళ్ళను ఉపయోగించారని వార్తలు వచ్చాయి. బీటూ బాంబర్లు, వందలాది యుద్ధవిమానాలు, సబ్‌మెరైన్లతో సహా సర్వశక్తులనూ వాడి అమెరికా జరిపిన ఈ దాడిలో ఇరాన్ అణుస్థావరాలు ధ్వంసమైపోయాయి. పూర్తిగా, సమూలంగా వాటిని తుడిచిపెట్టేసినట్టు ట్రంప్ ప్రకటించాడు. చివరకు ఫలితం తేలింది కనుక యుద్ధం మ-ంగిస్తున్నట్లు ప్రకటించాడు. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం ఎన్‌పిటీలో భాగస్వామి కాకుండా, భారీగా అణ్వాయుధాలు పోగేసుకున్న ఇజ్రాయెల్, ఆ ఒప్పందంమీద సంతకం చేసిన ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు పోగుబడివున్నాయన్న ఆరోపణతో, ఇరాన్‌ను నిరాయుధం చేయడమే తన లక్ష్యంగా ప్రకటించి జూన్ 13న ఈ యుద్ధంలోకి దిగింది. కదనరంగంలోకి అమెరికా ప్రత్యక్షప్రవేశంతో ఆ మూడు అణుకేంద్రాలను నాశనం చేయడమనే లక్ష్యం పరిపూర్ణమైంది. అందుకే వెంటనే యుద్ధం ఆగిపోవాలి. ప్రపంచం ఇక కంటినిండా నిద్రపోవచ్చునని ప్రకటించి యుద్ధ విరమణను ప్రకటించేశాడు. అణుస్థావరాల నాశనంతో ఇరాన్ కాళ్ళబేరానికి వస్తుందని ట్రంప్ నమ్ముతున్నారు. శాంతిచర్చలకు, ఒప్పందాలకు కాలం చెల్లిందని, ఇక ప్రతీకారమే మిగిలిందని ప్రకటించిన ఇరాన్ కూడా శాంతిని కోరుకుంటూ యుద్ధ విరమణకు ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఎందుకంటే ఇందులో ఎవరు పట్టుదలకు పోయినా మారణహోమం తప్పదు. ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చిరించినా ఆపని చేసే శక్తి లేదనే చెప్పాలి. దోహాలో ఉన్న అమెరికా స్థావరంపై దాడి చేసినా అది కూడా నామమాత్రమనే చెప్పుకోవాలి. ఇరాన్‌కు అత్యంత సమీపంలోనే అది గట్టిగాదెబ్బతీయగల దూరంలోనే అమెరికా స్థావరాలు అనేకం ఉన్నాయి. అయినా సాహసం చేయలేకపోయింది. హోర్ముజ్ జలసంధి మూతబడే ప్రమాదం ఉందంటూ వార్తలు రావడంతో స్టాక్‌మార్కెట్లు తలకిందులయ్యాయి. చమురుధరలు అమాంతంగా పెరిగాయి. ఎగబాకుతున్నాయి. ఇరాన్‌కు మాటసాయం చేస్తున్న దేశాలు ఆయుధాలతో ఆదుకుంటాయన్న నమ్మకం లేకుండా పోయింది. ఈ క్రమంలో ప్రపంచానికి ఇంధనాన్ని సమకూర్చే ఈ కీలకమైన ప్రాంతం యుద్ధజ్వాలల్లో కొనసాగడం సరికాదు. ఇదే ప్రపంచ దేశాలూ కోరుకున్నాయి. దీంతో ఎట్టకేలకు యుద్ధం ముగిసిందన్న ప్రకటన ప్రపంచ దేశాలకు ఊరటనిచ్చే అంశంగా చూడాలి.

# ఇరాన్-ఇజ్రాయిల్ మధ్యముగిసిన యుద్ధం

### కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకారం




**న్యూయార్క్,జూన్ :** ఇరాన్-ఇజ్రాయెల్‌యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన జారీ చేశారు. యుద్ధం ముగిసిందంటూ ట్రంప్ పోస్ట్ పెట్టారు. కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయని వెల్లడించారు. 24 గంటల్లో సీజ్ ఫైర్ అమలులోకి వస్తుందని చెప్పారు. 12 రోజుల యుద్ధానికి ఇది ముగింపు అని ప్రకటించారు. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్ పై అమెరికా నుంచి తీవ్రస్థాయి దాడులు చేసిన వెంటనే మరుసటి రోజు ఇజ్రాయెల్ ఆ దేశంపై ముప్పేట దాడులు చేయడంతో ఇరాన్ విలవిలలాడిపోయింది. ఇజ్రాయెల్ చేసిన ఎదురుదాడులను ఇరాన్ ప్రతిఘటించింది. అత్యంత వ్యూహాత్మకంగా ఇజ్రాయెల్ సోమవారం ఇరాన్ సైన్యం ఇరానియన్ రెవెల్యూషనరీ గార్డు (ఐఆర్‌జి) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. మరో వైపు ఇరాన్‌లోని అత్యంత కీలకమైన ఎవిన్ ప్రిజన్‌ను కూడా ధ్వంసం చేసింది. ఇరాన్ తాజాగా ఇజ్రాయెల్‌పై ట్రూప్రామిస్ త్రీ పేరిట సైనిక చర్యకు దిగిందని సైనిక వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ నగరాలు జెరుసలెం, హఫియా, టెల్ అవీవ్‌పై ఇరాన్ దాడులకు పాల్పడింది. ఈ క్రమంలో ఇరాన్ ,ఇజ్రాయెల్ యుద్ధం ముగిసిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా 'ట్రూత్'లో మంగళవారం పోస్టు చేశారు. 'అందరికీ అభినందనలు. ఇజ్రాయెల్, ఇరాన్‌లు పూర్తి కాల్పుల విరమణకు అంగీకరించాయి. మరో ఆరు గంటల్లో చర్యలు ప్రారంభం కానున్నాయి. 12 గంటల్లో యుద్ధం అధికారికంగా ముగియనుంది. తొలుత ఇరాన్ కాల్పుల విరమణను ప్రారంభించనుంది. అనంతరం ఇజ్రాయెల్ దాన్ని అనుసరించనుంది. దీంతో 12 రోజుల యుద్ధానికి ముగింపు కార్డు పడనుంది. ఒక దేశం కాల్పుల విరమణ పాటించేప్పుడు మరో దేశం శాంతి, గౌరవంతో ఉండాల్సి ఉంటుంది. ప్రతిదీ సరిగ్గా జరుగుతుందనే భావిస్తున్నాను. ఇందు కోసం నేను రెండు దేశాలను అభినందించాలనుకుంటున్నాను. ఈ యుద్ధం ఏళ్ల తరబడి కొనసాగి ఉంటే పశ్చిమాసియా నాశనమయ్యేది. కానీ అలా జరగలేదు. ఇక ముందూ అలా జరగదు. ఇజ్రాయెల్, ఇరాన్‌తో సహా మధ్యప్రాచ్యం, ప్రపంచ దేశాలతోపాటు అమెరికాకు దేవుడి దయ ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.



## ట్రంప్ ప్రకటనపై సానుకూలత

### యుద్ధాన్ని ఆపేస్తున్నట్లు ఇరాన్ అంగీకారం

**టెహ్రాన్, జూన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు క్షణక్షణానికో మలుపు తిరుగుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పందం జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ.. ఇంకా ఘర్షణలు కొనసాగాయి. ఈ క్రమంలోనే ఇరాన్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం మొదలైనట్లు అధికారికంగా ప్రకటించింది. ఈమేరకు టెహ్రాన్ అధికారిక మీడియా వెల్లడించింది. అటు ట్రంప్ కూడా దీనిపై స్పందించారు. 'కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. దయచేసి దాన్ని ఉల్లంఘించొద్దు' అని అమెరికా అధ్యక్షుడు తన ట్రూత్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ పక్రియ ఎలా జరగనుందనే దాన్ని కూడా ఆయన అందులో వివరించారు.'ఇప్పటినుంచి దాదాపు ఆరు గంటల తర్వాత ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పరం తుదివిడత దాడులు పూర్తి చేసుకొని కాల్పుల విరమణ ఒప్పందానికి వస్తాయి. తొలుత అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఇరాన్ కాల్పుల విరమణను మొదలు పెట్టాల్సిఉంటుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుంచి ఇజ్రాయెల్ కాల్పుల విరమణను మొదలుపెడుతుంది. అలా 12 గంటలు ముగిసిన తర్వాత 12 రోజుల యుద్ధానికి అధికారిక ముగింపు లభిస్తుంది. ఈ ఒప్పందం అమల్లో ఉన్న వేళ పరస్పరం శాంతియుతంగా, గౌరవ ప్రదంగా వ్యవహరించాలి' అని ట్రంప్ పేర్కొన్నారు. అన్నట్లుగానే ఇరాన్ తొలుత కాల్పుల విరమణను ప్రకటించింది. ఇక్కడి నుంచి 12 గంటల తర్వాత ఇజ్రాయెల్ కూడా దీన్ని పాటించాల్సి ఉంటుంది. అయితే, తాజా పరిణామాలపై ఇజ్రాయెల్ (ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. అయితే, కాల్పుల విరమణను ప్రకటించడానికి చివరి నిమిషం వరకు టెహ్రాన్ దాడులకు పాల్పడింది. పలు దఫాలుగా ఇజ్రాయెల్ పైకి క్షిపణులు ప్రయోగించింది. దీని కారణంగా బీర్‌షెబాలోని ఓ భవనం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా.. పలువురు గాయపడినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. ఈ కాల్పుల విరమణ ఒప్పందం గురించి తొలుత ఇరాన్ చేసిన ప్రకటనలు గందరగోళానికి గురిచేశాయి. తాము ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని, ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే తామూ ఆపేస్తామని టెహ్రాన్ విదేశాంగ మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ తర్వాత కాసేపటికే.. టెల్‌అవీవ్‌పై టెహ్రాన్ సైనిక కార్యకలాపాలు ముగిశాయని అర్థం వచ్చేలా పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా తమ సాయుధ దళాలు చివరివరకు శక్తిమంతమైన పోరాటం కొనసాగించాయని చెబుతూ.. కాల్పుల విరమణకు సిద్ధమేనన్న సంకేతాలిచ్చారు.

## కాల్పుల విరమణను అంగీకరించిన ఇజ్రాయిల్



**టెల్ అవీవ్:** పశ్చిమాసియాలో యుద్ధం చల్లారినట్లే కన్పిస్తోంది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు దేశాలు అంగీకరించాయి. ఇప్పటికే టెహ్రాన్ కాల్పుల విరమణను మొదలుపెట్టగా.. సీజ్ ఫైర్‌ను తామూ అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ నుంచి అణుముప్పు తొలగిపోయిందని నెతన్యాహు అందులో పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాల్పు విరమణ ప్రకటనతో దిగొస్తున్న క్రూడాయిల్ ధరలు

### స్టాక్ మార్కెట్లలో సానుకూల పవనాలు




**న్యూఢిల్లీ:** కాల్పు విరమణ ప్రకటనతో దిగొస్తున్న క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి. స్టాక్ మార్కెట్లలో సానుకూల పవనాలు మొదలయ్యాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా కలవరపెట్టిన క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా దిగొచ్చాయి. ఇజ్రాయెల్-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో ముడి చమురు ధరలు 5 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. ఈ ప్రకటన అనంతరం బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 3.53 డాలర్లు లేదా 4.94 శాతం తగ్గుముఖం పట్టి 67.95 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ రకం కూడా 5 శాతం మేర క్షీణించి బ్యారెల్ 65 డాలర్ల వద్ద కొనసాగుతోంది. వారం కనిష్ఠానికి చేరాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో ఇటీవల అమెరికా కూడా జత కలిసిన సంగతి తెలిసిందే. ఇరాన్ అణుస్థావరాలపై యూఎస్ దాడి చేసింది. దీంతో హర్మూజ్ సంధిని మూసివేత దిశగా ఇరాన్ అడుగులు వేసింది. ఇదే జరిగితే బ్యారెల్ చమురు ధర 80 డాలర్లు దాటుతుందని విశ్లేషకులు అంచనా వేశారు. దీనివల్ల ప్రధానంగా దిగుమతుల పై ఆధారపడే మన దేశానికి ద్రవ్యలోటు పెరగడంతో పాటు ద్రవ్యోల్బణమూ పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ ట్రంప్ ప్రకటించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు ఈ వార్తల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కూడా దూసుకెళ్తున్నాయి. మధ్యాహ్నం సమయానికి సెన్సెక్స్ 945 పాయింట్ల లాభంతో 82,842.37 వద్ద కొనసాగుతుండగా.. నిఫ్టీ సైతం 302 పాయింట్ల లాభంతో 25,274.55 వద్ద ట్రేడయ్యింది.

## విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

### లెక్కల మాస్టార్‌పై ఫోక్సో కేసు నమోదు

### విధుల నుంచి తొలగించిన ప్రభుత్వం

**సిమ్లా, జూన్ 24 :** 24మంది విద్యార్థినులను వేధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఆ ఉపాధ్యాయుడుని విధుల నుండి తొలగించడంతో పాటు మూడు రోజుల పాటు కస్టడీ విధించినట్లు వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో సిర్మౌర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నిందితుడు గణితశాస్త్రం బోధిస్తున్నాడు. 8వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయుని వేధింపుల గురించి పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు తమను అనుచితంగా తాకాడని 24 మంది విద్యార్థులు ప్రిన్సిపల్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులను ఒక సమావేశానికి పిలిపించారు. వారిలో చాలామందికి తమ పిల్లలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి తెలియదని తేలింది. అనంతరం పాఠశాల అధికారులు ఈ ఫిర్యాదును పాఠశాల లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి పంపారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మూడు రోజుల కస్టడీ విధించినట్లు తెలిపారు. విద్యాశాఖ సైతం వెంటనే స్పందించిందని, నిందితుడుని తక్షణమే సస్పెండ్ చేసిందని అధికారులు తెలిపారు. 'తీవ్రమైన,సున్నితమైన సమస్య'గా పేర్కొంటూ పాఠశాల డైరెక్టర్.. ఈ ఘటనపై వెంటనే విచారణ జరపాలని డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు.

# విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

**రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు**

**రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాం: తుమ్మల**



**హైదరాబాద్,జూన్24 :** సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డిలా వ్యవసాయంపై ఇంత సాహసోపేతమైన నిర్ణయం ఎవరూ తీసుకోలేదని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్నవారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రూ. 2లక్షల్లోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నామని.. అలాగే చేశామని గుర్తుచేశారు. రైతునేస్తం సభలో ఆయన మాట్లాడుతూ..తమను విమర్శించే హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని చెప్పారు. బీజేపీ కూడా కేంద్రంలో రూ. 4లక్షలు రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఐదు నెలల వరకు కూడా రైతుబంధు వేయలేదని.. కానీ ఇప్పుడు తమ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా తొమ్మిది రోజుల్లోనే రూ. 9వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని ఉద్ఘాటించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. 9 రోజుల్లోనే రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామంటే కొందరు నేతలు నమ్మలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు తెస్తున్నామని వెల్లడించారు. ఏడాది కాలంలోనే రేవంత్ ప్రభుత్వం రైతుల కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులను మరువబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇంకా చాలా పథకాలు తీసుకురాబోతుందని ఉద్ఘాటించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన తర్వాతనే తమకు ఓటు వేయమని అడుగుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నిజంగానే ఈరోజు దేశ చరిత్రలో లిఖించదగిన రోజని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే రూ. 9000 కోట్లు రైతుల ఖాతాల్లో వేయడం దేశ చరిత్రలో ఇంతవరకు ఎక్కడ జరగలేదని చెప్పారు. ’వ్యవసాయం అంటే కాంగ్రెస్. వ్యవసాయం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్. రైతుల కోసం ఉచిత కరెంట్‌ని, గిట్టుబాటు ధరను తెచ్చిందే కాంగ్రెస్. హరిత విప్లవాన్ని తెచ్చిందే కాంగ్రెస్. ఏ రాజకీయ పార్టీ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించలేదు. రైతుల కోసం బీఆర్ఎస్ ఏమి చేయలేదు. అందరి ఖాతాల్లో రూ. 9000 కోట్లు వేస్తామని చెప్పామని.. అలానే వేశాం అని పేర్కొన్నారు.

# పహల్గామ్ దాడిపై కొనసాగుతున్న ఎన్ఐ దర్యాప్తు

**ఉగ్రవాదుల ప్రవేశంపై కూపీ లాగుతున్న పోలీసులు**

**న్యూఢిల్లీ, జూన్ 24:** పహల్గామ్ ఉగ్ర దాడిపై కేంద్ర సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించింది. తాజాగా ఉగ్రవాదులు భారత్‌లోకి ఎలా ప్రవేశించారన్న దానిపై దర్యాప్తు చేపట్టగా అధికారులకు కీలక సమాచారం లభించింది. బాట్కోట్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్క్‌కు చెందిన బషీర్ అహ్మద్ జోథర్‌లను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించినట్లుగా ఒప్పుకున్నారు. ఇక పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత.. ముగ్గురు ఉగ్రవాదులకు హిల్ పార్క్‌లోని ఒక గుడిసెలో ఉన్నట్లుగా తేలింది. ఈ ఉగ్రవాదులకు స్థానికులైన పర్వైజ్, బషీర్ ఆహారం, ఇతర వసతులు కల్పించినట్లుగా తేలింది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ చేరవేసినట్లుగా గుర్తించారు. ఇక ముగ్గురు ఉగ్రవాదులు.. పాకిస్థాన్‌లోని అబోటాబాద్ నుంచి ముజఫరాబాద్ మీదుగా పూంజ్-రాజౌరికి చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. సరిహద్దు కారిడార్ ద్వారా భారత్‌లోకి ప్రవేశించి ఉంటారని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇక నిఘా వర్గాల దర్యాప్తు మేరకు.. ముగ్గురు ఉగ్రవాదులు కూడా అధిక శిక్షణ పొందినవారుగా కనిపెట్టారు. శిక్షణలో అధునాతన పోరాట పటిమలు కలిగిన వారిగా తేల్చారు. అంతేకాకుండా రహస్య కదలికలు, మనుగడ వ్యూహాలు కలిగి ఉన్నట్లుగా తేలింది. పహల్గామ్‌కు ముందు జమ్మూకాశ్మీర్‌లోని స్పిన్నర్ ప్రాంతంలో జరిగిన దాడులతో పాటు పలు దాడుల్లో ఈ ముగ్గురు ఉగ్రవాదులు పాల్గొని ఉండొచ్చని భావిస్తున్నారు. ఇక ఉగ్రవాదుల కదలికలు గురించి డిజిటల్ పాదముద్రలు, కమ్యూనికేషన్ మార్గాలను దర్యాప్తు సంస్థ విశ్లేషిస్తోంది. ప్రత్యేక కమ్యూనికేషన్ ఉపయోగించడం వల్ల ట్రాకింగ్ కష్టతరంగా మారింది. ప్రధానంగా స్థానికుల మద్దతుతోనే ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లుగా గుర్తించారు. ప్రస్తుతం స్థానికులు ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాదులు చెలరేగిపోయారు. 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. స్త్రీలను, పిల్లలను వదిలిపెట్టి భర్తలను చంపేశారు. పదుల కొద్ది గాయపడ్డారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం.. పాకిస్థాన్‌పై కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇక మే 7న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. మొత్తానికి పాకిస్థాన్ కాళ్ల బేరానికి రావడంతో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది.



# ప్రతిష్టాత్మకంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

**రాజకీయాలకు అతీతంగా ఉత్సవాల నిర్వహణ**

**భక్తులకు ఇబ్బంది లేకుండా పక్కాగా ఏర్పాట్లు**

**అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష**

**పటిష్టాంగా ఏర్పాట్లు చేయాల**

**మంత్రి పొన్నం సూచన**





**హైదరాబాద్, జూన్ :** చారిత్రాత్మకమైన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా అత్యంతం వైభవంగా చేసుకుందామని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. నగరంలో ఎంతో వైభవంగా జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలపై ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. గత సంవత్సరం ఏమైనా పొరపాటు జరిగితే సమీక్షించుకుని మరిన్ని ఏర్పాట్లు చేయడానికి ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయ ఏర్పాట్ల కోసం భాగస్వామ్యం అవుతున్న అందరికీ అభినందనలు తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరఫున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం లోపల కేబుల్ వైర్‌లు కొత్తవి వేసి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. భారీ కెడింగ్ జాలి ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆతిథ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసి పోరన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు స్థానిక హైదరాబాద్ ప్రజలు వారి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఒక్కో వారం ఒక్కో ఏరియాలో పండుగ జరుగుతుంది కాబట్టి ఆయా ప్రాంతాల్లో వాటర్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని.. అవసరమైతే రెండుసార్లు నీటిని ఇవ్వాలని ఆదేశించారు. హైదరాబాద్ మొత్తం ఒకేసారి పండుగ జరిగితే కొంత ఇబ్బంది ఉంటుందని.. కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉంటుందని, భద్రత విషయంలో పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని.. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3600 దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో జరిగిందని తెలిపారు. గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట, లాల్ దర్వాజా ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని.. జోగిని వాళ్ళకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. తమకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీ వస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని తెలిపారు. డెక్కన్ మానవ సేవ సమితి, ఇతర సంస్థలు ఇక్కడ చాలా సేవ కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తలసాని, జిల్లా కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత పాల్గొన్నారు.

# దేశంలోనే బ్లాక్ బాక్స్ విశ్లేషణ

**విదేశాలకు పంపినట్లు పుకార్లు మాత్రమే**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టీకరణ**



YÜDE, pH 24: అహ్మదాబాద్ విమానప్రమాదం తరవాత విశ్లేషణ కోసం బ్లాక్ బాక్స్‌ను అమెరికా పంపినట్టు వస్తున్న ఊహాగానాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మంగళవారంనాడు తోసిపుచ్చారు. ’అవన్నీ ఊహాగానాలే. బ్లాక్ బాక్స్ ఇండియాలోనే ఉంది. ప్రస్తుతం దీనిని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) పరిశీలిస్తోందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఎప్పటిలోగా బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని వెలికితీసే అవకాశం ఉందని అడిగినప్పుడు, ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం పక్రియను పరిశీలించనీయండని అన్నారు. విమానం కూలిపోవడానికి ముందు ఏమి జరిగిందో లోతుగా తెలుసుకునేందుకు బ్లాక్ బాక్స్ డీకోడింగ్ జరుగుతోందని ఇంతకుముందు మంత్రి చెప్పారు.అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్ప కూలడం వెనుక గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తును అధికారులు కొనసాగిస్తు న్నారు. ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఈ విమానంలో అసలేం జరిగిందో తెలుసుకోనేందుకు అందరి దృష్టీ ఇప్పుడు 'బ్లాక్ బాక్స్' విశ్లేషణపై పడింది. ఈ నేపథ్యంలో బ్లాక్‌బాక్స్‌ను విచారణ కోసం విదేశాలకు పంపించారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనంటూ కొట్టిపారేశారు. ఫిక్కీ, కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పుణెలో జరిగిన హెలికాప్టర్స్ అండ్ స్మాల్ ఎయిర్‌క్రాఫ్ట్ సమ్మిట్ 2025 సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపిస్తున్నారా? అని విలేకర్లు అడగ్గా.. ‘అవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్‌బాక్స్ భారత్‌లోనే ఉంది. దీన్ని ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పరిశీలిస్తోంది‘ అని స్పష్టం చేశారు. ఎప్పటివరకు దీంట్లోని డేటాను పొందొచ్చని మరో ప్రశ్నకు స్పందిస్తూ.. ’ఇది చాలా సాంకేతికతతో కూడిన వ్యవహారం. ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం పక్రియను పరిశీలించనివ్వండి‘ అన్నారు. జూన్ 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటికే ఓ వైద్య కళాశాల వసతిగృహంపై కూలడం పెను విషాదం నింపింది. ఈ ఘటనలో 240 మంది ప్రయాణికులతో పాటు 270మంది ప్రాణాలు కోల్పోగా.. విమాన ప్రయాణికుల్లో ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో జూన్ 13న ఎయిరిండియా బోయింగ్ 787 -8 డ్రీమ్‌లైనర్ విమానం బ్లాక్ బాక్స్‌ను అధికారులు ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్ అనేది విమానంలో ఏం జరిగిందో అన్న సమాచారాన్ని రికార్డు చేసే ఓ చిన్న పరికరం. ఇది విమాన ప్రమాదాల దర్యాప్తులో దీన్ని డీకోడ్ చేయడం వల్ల విమాన ప్రమాదానికి కొన్ని క్షణాల ముందే ఏం జరిగిందో తెలుసుకొనేందుకు ఉపయోగపడుతుంది.

# అంజనాదేవి ఆరోగ్యంపై రూమర్లు

**అమ్మ ఆరోగ్యంగా ఉందన్న నాగబాబు**

**హైదరాబాద్,జూన్24 :** మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవికి తీవ్ర అనారోగ్యం అని.. హాస్పిటల్‌లో జాయిన్ చేశారంటూ ఉదయం నుంచి వార్తలు వస్తున్నాయి. అటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేబినెట్ మధ్యలో నుంచే హైదరాబాద్ వచ్చేస్తున్నాడని.. చిరంజీవి, రామ్ చరణ్ షూటింగ్ క్యాన్సిల్ చేసుకున్ని వస్తున్నారంటూ పుకార్లు వచ్చాయి. తాజాగా వీటిపై నాగబాబు స్పందించారు. ’మా తల్లి ఆరోగ్యం చాలా బాగుంది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ ఫేక్’ అంటూ ఖండించారు. ఉదయం నుంచి ఈ రకమైన వార్తలు రావడంతో మెగా ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు. కానీ అవేమీ నిజం కాదని తేలిపోయింది. గతంలోనూ ఇలాంటి వార్తలు చాలానే వచ్చాయి. రెండు, మూడు సార్లు చిరంజీవి స్వయంగా స్పందిస్తూ రూమర్లను ఖండించారు. తన తల్లి ఆరోగ్యంపై ఇలాంటివి రాయొద్దంటూ వేడుకున్నారు. కొద్ది నిముషాల క్రితమే ఉపాసన కూడా అంజనాదేవితో చేసిన ఓ వంటల వీడియోను షేర్ చేసింది. దాన్ని బట్టి ఆమెకు ఎలాంటి అనారోగ్యం లేదని తెలుస్తోంది.


# బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

**దీనిపై దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలి**

**తెలంగాణ వాడుకోగా మిగిలిన నీటినే వాడుకుంటాం**

**తెలంగాణ అనేక ప్రాజెక్టులు కడుతున్న అడ్డుకోవడం లేదు**

**కేబినేట్‌లో సిఎం చంద్రబాబు వెల్లడి**



**అమరావతి :** పోలవరం బనకచర్లపై తెలంగాణ నేతలు అందరూ మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణ కేబినెట్‌లో బనకచర్లపై వాళ్లు డిస్కస్ చేశారని అన్నారు. ఏపీ కూడా మన వాదనలు వినిపించాలని సూచించారు. తెలంగాణ వాళ్లు అనుమతి లేని ప్రాజెక్ట్‌లను కూడా కడుతున్నారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇంకా చాలా ప్రాజెక్ట్‌లను వాళ్లు కడుతున్నారని తెలిపారు. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లను మాత్రమే కదా ఏపీ వాడుకునేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తెలంగాణ నేతలు బనకచర్లపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వరద జలాలను మనం వాడుకుంటామని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో కూటమి నేతలు చెప్పాలని ఆదేశించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై మనం దశల వారిగా ముందుకు వెళ్తామని సూచించారు. ఆ తర్వాత కేంద్రప్రభుత్వం ఏం చెబుతుందో దాని ఆధారంగా మనం నిర్ణయం తీసుకుందామని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లు ఎప్పుడూ శంకుస్థాపన చేస్తామనేది త్వరగా నిర్ణయించాలని మంత్రి లోకేష్ అన్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌కి అవసరమైతే కేంద్ర ప్రభుత్వ జోక్యం కూడా అవసరమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ విషయం అర్థమయ్యేలా చెప్పేందుకు అవసరమైతే కేంద్రం ద్వారా ఓ సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పారు. సున్నితమైన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌పై నేతలు పూర్తి అవగాహనతో జాగ్రత్తగా మాట్లాడాలని దిశానిర్దేశర చేశారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం ముగిసింది. మె-ంత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ‘తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉంది.‘ అని అన్నారు. అమరావతిలో మలివిడత భూసేకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తొలివిడత నిబంధనలే మలివిడతకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాస్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం తేల్చి చెప్పారు. సాంకేతిక సమస్యల సాకుతో దాటవేత ధోరణి సరికాదని, ఇబ్బందులుంటే తనతో మాట్లాడవచ్చన్నారు. రెవెన్యూ సమస్యలపై తరచూ అడుగుతూనే ఉంటానని గట్టిగా చెప్పారు. కూటమి ఏడాది విజయాలు ఇంటింటికీ తీసుకెళ్లే కార్యాచరణ రూపొందించామన్న సీఎం.. జులై 1 నుంచి ఎమ్మెల్యేలు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడాది పాలనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశం పెట్టాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు ఏడాది పాలనపై సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ నెలాఖరులోపు ఈ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జులై 1వ తేదీ నుంచి ఏడాది పాలనపై ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి వివరించాలని నిర్దేశిరచారు సీఎం చంద్రబాబు. కూటమిలోని అన్ని పార్టీల నేతలను కలుపుకొని ముందుకు వెళ్లాలని కోరారు.

# భారత బౌలర్ల ప్రదర్శనపైనే భారం

**రసవత్తరంగా భారత్, ఇంగ్లండ్ తొలి టెస్ట్**
**ఇంగ్లండ్ ముందు 371 పరుగుల లక్ష్యం**
**రెండో ఇన్నింగ్స్ లో భారత్ 364లకు ఆలౌట్**
**కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ సెంచరీలు**




ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న తొలి టెస్టులో నాలుగో రోజు ఆట ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌లో 90/2తో నాలుగు రోజు ఆటను ప్రారంభించిన టీమ్ఇండియా 364 పరుగులకు ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో (6 పరుగులు) కలుపుకొని మొత్తం 369 పరుగులను సాధించింది. ప్రత్యర్థికి టార్గెట్‌ను నిర్దేశించింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన ఇంగ్లాండ్ ఆట ముగిసేసరికి 21/0 స్కోరుతో నిలిచింది. అయితే ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 350 పరుగులు అవసరం. కానీ ఇంకో రోజు ఆట మిగిలి ఉండటంతో మ్యాచ్ ఫలితం తేలే అవకాశాలే ఎక్కువ. బౌలర్లు సమష్టిగా రాణించడంపైనే టీమ్ఇండియా విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. కేఎల్ రాహుల్ (137బీ 247 బంతుల్లో 18 ఫోర్లు), రిషభ్ పంత్ (118బీ 140 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు బాదారు. దీంతో నాలుగో రోజు రెండో సెషన్ ముగిసేసరికి భారత్ 298/4తో నిలిచి భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ, తొలి ఇన్నింగ్స్ మాదిరిగానే చివర్లలో వం-సగా వికెట్లు కోల్పోయింది. పలువురు ప్లేయర్లు నిరాశపరచడంతో 31 పరుగుల వ్యవధిలో ఆరు వికెట్లు చేజార్చుకుని తక్కువ స్కోరుకే ఆలౌటైంది. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 3, జోష్ టంగ్ 3, బషీర్ 2 క్రిస్ వోక్స్, బెన్ స్టోక్స్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471, ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌట్ అయ్యాయి. అంతకుముందు 90/2 ఓవర్ నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 364 పరుగులకే ఆలౌటైంది. కేఎల్ రాహుల్(247 బంతుల్లో 18 ఫోర్లతో 137), రిషభ్ పంత్(140 బంతుల్లో15 ఫోర్లు, 3 సిక్స్‌లతో 118) సెంచరీలతో రాణించినా.. మిడిలార్డర్, లోయరార్డర్ వైఫల్యం కొంపముంచింది. 31 పరుగుల వ్యవధిలోనే టీమిండియా చివరి 6 వికెట్లు కోల్పోయింది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/80), జోష్ టంగ్(3/72) మూడేసి వికెట్లు తీయగా.. షోయబ్ బషీర్(2/90) రెండు వికెట్లు పడగొట్టాడు. క్రిస్ వోక్స్, బెన్ స్టోక్స్ చెరో వికెట్ తీసారు. నాలుగో రోజు ఆట ఆరంభంలోనే టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(8) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు అతను రెండు పరుగులు మాత్రమే జోడించి వెనుదిరిగాడు. ఈ పరిస్థితుల్లో పంత్‌తో కలిసి రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కండిషన్స్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉండటంతో ఈ జోడీ ఓపికగా ఆడింది. ఈ క్రమంలో రాహుల్ 87 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో భారత్ 153/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా ఆడగా.. రాహుల్ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. 83 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదిన పంత్ అనంతరం భారీ సిక్సర్లతు బాదాడు. మరోవైపు బషీర్ బౌలింగ్‌లో క్విక్ డబుల్ తీసి రాహుల్ 202 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మ-రోవైపు సెంచరీకి చేరువైన పంత్.. మూడెంకల మార్క్ అందుకోవడానికి కాస్త సమయం తీసుకున్నాడు. షోయబ్ బషీర్ బౌలింగ్‌లో సింగిల్ తీసి సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఒంటి కన్ను సెలెబ్రేషన్స్‌తో అందర్నీ ఆశ్చర్య పరిచాడు. అనంతరం జోరూట్ వేసిన మరుసటి ఓవర్‌లో 4, 6, 4 బాదాడు. బషీర్ బౌలింగ్‌లో పంత్ (118) భారీ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 195 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి కరుణ్ నాయర్ రాగా.. రాహుల్ తనదైన శైలిలో బ్యాటింగ్ చేశా డు. దాంతో ఇంగ్లండ్ 298/4 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూ డో సెషన్ ఆరంభంలోనూ రాహుల్, కరుణ్ నాయర్ సాధి కారికంగా బ్యాటింగ్ చేశారు. 46 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని బ్రైడన్ కార్స్ విడదీసాడు. స్టన్నిం గ్ డెలివరీతో రాహుల్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఆ వెంటనే కరుణ్ నాయర్.. క్రిస్ వోక్స్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. జోష్ టంగ్ బౌలింగ్ లో శార్దూల్ ఠాకూర్ చెత్త షాట్‌తో వికెట్ పారేసుకోగా.. సిరాజ్, బుమ్రా వం-సగా ఔటయ్యారు. జడేజా ఒంటరి పోరాటం చేసే ప్రయత్నం చేయగా.. మరో ఎండ్‌లో అతనికి సహకారం లభిం చలేదు. ప్రసిధ్ కృష్ణను ఔట్ చేసిన షోయబ్ బషీర్ భారత ఇన్నిం గ్స్‌కు తెరదించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేసింది. అనంతరం ఇంగ్లండ్ 465 పరుగులు చేయడంతో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. బుమ్రాపైనే ఆధారపడి ఉన్నాయి.

## టీమిండియా అరుదైన ఘనత

ఇంగ్లాండ్‌లో లీడ్స్ వేదికగా జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు కొత్త రికార్డులను సృష్టిస్తోంది. సోమవారం నాలుగో రోజు ఆటలో టీమిండియా అరుదైన ఘనతను సాధించింది. 93 ఏళ్ల భారత టెస్టు చరిత్రలో గిల్ నాయకత్వంలోని జట్టు కొత్త మైలు రాయిని అధిగమించింది. భారత జట్టు 1932లో టెస్టు క్రికెట్ ఆడటం ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 93 సంవత్సరాలు గడిచాయి. ఈ కాలంలో టీమిండియా మొత్తం 591 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. కానీ, ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఒకే మ్యాచ్‌లో ఐదుగురు భారత బ్యాటర్లు శతకాలు చేయడం ఎప్పుడూ జరగలేదు. అయితే ఇప్పుడు, శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో ఆ చరిత్ర తిరగరాశారు. లీడ్స్‌లో ఇంగ్లాండ్‌పై జరుగుతున్న తొలి టెస్టులో భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో ఆ ఘనతను సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ (101), శుభ్‌మన్ గిల్ (147), రిషభ్ పంత్ (134) సెంచరీలు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ (137), పంత్ మళ్లీ 118 పరుగులు బాదేశారు. ఇలా ఒకే టెస్టు మ్యాచ్‌లో ఐదుగురు ఆటగాళ్లు శతకాలు చేయడం భారత క్రికెట్ చరిత్రలో తొలిసారి. కాగా, లీడ్స్‌లో జరుగుతున్న టెస్ట్ గిల్‌కు కెప్టెన్‌గా తొలి మ్యాచ్. ఈ మ్యాచ్ గిల్‌కి కెప్టెన్‌గా కలిసి వచ్చి తొలి ఇన్నింగ్స్‌లోనే శతకం కొట్టాడు. అంతేకాకుండా ఐదుగురు సెంచరీలు కొట్టడం ద్వారా తన నాయకత్వంలో జట్టు చరిత్రను సృష్టించింది. మ-రోవైపు రిషభ్ పంత్ కూడా ఈ మ్యాచ్‌లో మరో అరుదైన రికార్డు సాధించాడు. టెస్టు మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకం బాదిన రెండో వికెట్ కీపర్?గా గుర్తింపు పొందాడు. అంతేకాకుండా, విదేశాల్లో ఈ ఘనత సాధించిన తొలి వికెట్ కీపర్ కూడా పంతే కావడం విశేషం. లీడ్స్‌లో భారత జట్టు ఇంగ్లాండ్‌కు 371 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ వికెట్ కోల్పోకుండా 21 పరుగులు దక్కించుకుంది. ఈ మ్యాచ్ గెలవాలంటే ఇంగ్లాండ్ 350 పరుగులు చేయాల్సి ఉంది. అయితే ఇంగ్లీష్ టీమ్ ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అంత సులువు కాదని గత గణాంకాలు చెబుతున్నాయి. గత 77 ఏళ్లలో లీడ్స్?లో 371 పరుగుల లక్ష్యాన్ని చేధించిన టీమ్ ఏదీ లేదు. ఒకవేళ ఇంగ్లాండ్ జట్టు గెలిస్తే మాత్రం 77 ఏళ్ల చరిత్రను తిరిగి రాసినట్లే అవుతుంది.




## రింకూ సింగ్ వివాహం వాయిదా!

భారత క్రికెటర్ రింకు సింగ్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌ల పెళ్లి వాయిదా పడింది. మొదట వీరిద్దరూ నవంబర్‌లో పెళ్లి చేసుకోవాలని భావించారు. ఇటీవల ఎంగేజ్మెంట్ ఘనంగా జరిగింది. ఒక మీడియా నివేదిక ప్రకారం, నవంబర్ నెలలో రింకు సింగ్ బిజీ షెడ్యూల్ కారణంగా పెళ్లి తేదీని మార్చుతున్నారు. ఈ నెలలో లక్నోలో రింకు, ప్రియాల నిశ్చితార్థం జరిగింది, ఇక్కడ వారి రిసెప్షన్‌లో చాలా మంది ప్రముఖులు పాల్గొన్నారు. వీరిలో UP మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, రాజ్యసభ ఎంపీగా ఉన్న జయా బచ్చన్ కూడా ఉన్నారు. ఇప్పుడు అమర్ ఉజాలాలో ప్రచురించబడిన ఒక నివేదిక ప్రకారం, నవంబర్‌లో రింకు సింగ్ బిజీ షెడ్యూల్ కారణంగా పెళ్లిని వాయిదా వేశారు. అమర్ ఉజాలా ప్రకారం, రింకు సింగ్- ప్రియా సరోజ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఇప్పుడు పెళ్లి ఫిబ్రవరి 2026లో జరుగుతుందని, పెళ్లి కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. మొదట అనుకున్న ప్రకారం నవంబర్ 19న వివాహ వేడుకల కోసం వారణాసిలోని తాజ్ హోటల్‌ను కుటుంబం బుక్ చేసిందని పేర్కొంది. అయితే, రింకు నవంబర్ నెలలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. కనుక రెండు కుటుంబాలు పెళ్లి తేదీని మార్చవలసి వచ్చింది. తాజ్ హోటల్‌ను ఇప్పుడు ఫిబ్రవరి కోసం మళ్లీ బుక్ చేశారని, అయితే తేదీ ఇంకా వెల్లడి కాలేదని కూడా తెలిసింది. జూన్ 8న రింకు సింగ్, ప్రియా సింగ్‌ల నిశ్చితార్థం ఘనంగా జరిగింది. నిశ్చితార్థం తర్వాత, రింకు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ షేర్ చేస్తూ, తాను చాలా కాలంగా ఈ క్షణం కోసం ఎదురు చూస్తున్నానని చెప్పాడు. రింకు కొంతకాలం క్రితం IPL 2025లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. మరోవైపు, ప్రియా సరోజ్ ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ సీటు నుండి మచిలీషహర్ నుండి ఎంపీగా ఉన్నారు. ప్రియా తండ్రి తుఫానీ సరోజ్ కూడా సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులలో ఒకరు.

## బుమ్రా కంటే షమీనే బెస్ట్ బౌలర్

**టీమిండియా వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా**




టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తున్నాయి. ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో బుమ్రా ఐదు వికెట్లతో సత్తా చాటాడు. మిగతా బౌలర్లంతా విఫలమైన ఫ్లాట్ వికెట్‌పై వైవిధ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలోనే బుమ్రా టీమిండియా కోహినూర్ అని ఒకరంటే.. వరల్డ్ బెస్ట్ పేసరని మరొకరు ప్రశంసించారు. భారత దిగ్గజ పేసర్ కపిల్ దేవ్ కంటే కూడా బుమ్రా అత్యుత్తమ పేసర్ అని కొనియాడారు. కానీ టీమిండియా వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా మాత్రం భిన్నమైన వ్యాఖ్యలు చేశాడు. బుమ్రాలో ప్రత్యేకమైన బౌలింగ్ నైపుణ్యం ఉన్నప్పటికీ.. సీమ్ పొజిషన్ విషయంలో మహమ్మద్ షమీనే అత్యుత్తమమని చెప్పాడు. షమీ సీమ్ పొజిషన్‌కు బుమ్రా దగ్గరకు కూడా రాలేదని తెలిపాడు. కానీ షమీ లేజీ బౌలరని, ఫిట్‌నెస్‌ను కాపాడుకోలేక జట్టుకు దూరమయ్యాడని అభిప్రాయపడ్డాడు. మహమ్మద్ షమీ 64 టెస్ట్ మ్యాచ్‌ల్లో 229 వికెట్లు పడగొట్టాడు. సీమ్ పొజిషన్‌తో పాటు రివర్స్ స్వింగ్‌ను షమీ అద్భుతంగా రాబడుతాడని చెప్పాడు. 'బుమ్రా ప్రతిభావంతుడు. ప్రత్యేకమైన బౌలర్. కానీ సీమ్ పొజిషన్ విజయానికి వస్తే.. భారత్‌లో షమీని అధిగమించే బౌలర్ లేదు. కానీ షమీ కాస్త లేజీ. ఫిట్‌నెస్‌పై అతను మరింత ఫోకస్ పెట్టాలి. ఇదే విషయాన్ని ఒకసారి నేను అతనికి చెప్పాను. మరింత వేగంగా బౌలింగ్ చేసేందుకు ఫిట్‌గా మారాలని సూచించాను. ఇప్పటికే తాను వేగంగా బౌలింగ్ చేస్తున్నానని సమాధానం చెప్పాడు. షమీ రివర్స్ స్వింగ్‌ను కూడా అద్భుతంగా రాబడుతాడు.' అని చతేశ్వర్ పుజారా చెప్పుకొచ్చాడు. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత గాయంతో జట్టుకు దూరమైన మహమ్మద్ షమీ 14 నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో షమీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున దారుణంగా విఫలమయ్యాడు. టెస్ట్ మ్యాచ్‌లకు కావాల్సిన ఫిట్‌నెస్‌ను షమీ సాధించలేకపోయాడు. దాంతో ఇంగ్లండ్ పర్యటనకు షమీని బీసీసీఐ ఎంపిక చేయలేదు. జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు ఈ పర్యటనకు ఎంపికయ్యారు. కానీ బుమ్రాకు అండగా మరో ఎండ్‌లో రాణించలేకపోతున్నారు.



## జేక్ ఫ్రేసర్ మెక్‌గుర్క్ సిక్సర్ల సునామీ

ఐపీఎల్‌లో అట్టర్ ఫ్లాప్ పెర్ఫార్మన్స్.. వెర్రిపప్పుగా మారి ప్లేయింగ్ ఎలెవన్ నుంచి బయటకు వచ్చాడు. అయితే ఇప్పుడు సీన్ మారింది. వేరే విదేశీ లీగ్‌లో రచ్చలేపుతున్నాడు. సిక్సర్ల సునామీ సృష్టించి.. బౌలర్లను బెంబేలెత్తిస్తున్నాడు. మరి ఇంతకీ ఆ ప్లేయర్ ఎవరంటే.? అతడెవరో కాదు.. జేక్ ఫ్రేసర్ మెక్‌గుర్క్. ఢిల్లీ క్యాపిటల్స్ సుమారు రూ. 9 కోట్లు ఖర్చుపెట్టి మెక్‌గుర్క్‌ను అట్టిపెట్టుకుంది. ఓపెనర్‌గా తమ జట్టుకు పరుగుల వరద పరిస్తాడని ఊహించింది. కానీ ఆ ఆశలన్నీ అడియాశలు అయ్యాయి. పేలవ ప్రదర్శన కనబరిచి జట్టు నుంచి బయటకొచ్చాడు. ఇక ఇప్పుడు అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్‌లో దుమ్ములేపుతున్నాడు. శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మెక్‌గుర్క్.. మిడిలార్డర్‌లో పరుగులు రాబట్టుతున్నాడు. మొన్న ఎంఐ న్యూయార్క్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ షార్ట్(91)కు సహకారం అందించిన మెక్‌గుర్క్(64) మెరుపు అర్ధసెంచరీ రాబట్టాడు. మొత్తంగా 64 పరుగులు చేసిన మెక్‌గుర్క్.. ఈ ఇన్నింగ్స్‌లో 1 ఫోర్, 7 సిక్సర్లు బాదాడు. ఒక్క ఈ మ్యాచ్‌లో మాత్రమే కాదు.. మొత్తంగా ఐదు మ్యాచ్‌లు ఆడిన మెక్‌గుర్క్.. 194.06 స్ట్రైక్‌రేటుతో 6 ఫోర్లు, 20 సిక్సర్లతో 196 పరుగులు చేశాడు. టీ20ల్లో తన సత్తాను మ-రోసారి చాటుకున్నాడు.



## సెంచరీతో చెలరేగిన తిలక్ వర్మ

టీమిండియా యువ క్రికెటర్, తెలుగు తేజం తిలక్ వర్మ సెంచరీతో చెలరేగాడు. హాంప్‌షైర్ తరఫున కౌంటీ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన తిలక్ వర్మ.. ఎస్సెక్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనే శతకాన్ని అందుకున్నాడు. 239 బంతుల్లో మూడెంకల స్కోర్ అందుకొని కెరీర్‌లో ఆరో ఫస్ట్ క్లాస్ సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. సెంచరీ పూర్తయిన వెంటనే సిమన్ హార్మర్ బౌలింగ్‌లో సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ డీన్ ఎల్గర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ దూకుడుగా కాకుండా అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్ చేశాడు. చాలా ఓపికగా ఆడాడు. క్రీజులోకి వచ్చి రావడంతోనే హ్యాట్రిక్ బాల్ ఫేజ్ చేసిన తిలక్ వర్మ.. కండిషన్స్ గౌరవిస్తూ ఆచితూచి ఆడాడు. మూడో వికెట్‌కు 62 పరుగులు జోడించిన తిలక్ వర్మ.. నాలుగో వికెట్‌కు 68, ఐదో వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. తిలక్ సూపర్ బ్యాటింగ్‌తో ఈ మ్యాచ్‌లో హాంప్‌షైర్ భారీ స్కోర్ స్కోర్ దిశగా సాగుతోంది. ఇప్పటికే 393 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎస్సెక్స్ 296 పరుగులు చేసింది. భారత్ తరఫున ఇప్పటికే పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడిన తిలక్ వర్మ.. టెస్ట్ ఫార్మాట్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. భారత్ తరఫున 4 వన్డేలతో పాటు 25 టీ20లు ఆడిన తిలక్.. ఇప్పటి వరకు 18 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. టెస్ట్ క్రికెట్ తన ఫేవరేట్ ఫార్మాట్ అని తిలక్ వర్మ తెలిపాడు. సెంచరీ అనంతరం హాంప్‌షైర్ క్రికెట్ యూట్యూబ్ ఛానెల్‌తో మాట్లాడాడు. టెస్ట్ క్రికెట్‌లో అవకాశం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపాడు. 'టీ20ల్లో మూడో ర్యాంక్ సాధించడంతో అందరూ నేను టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అనుకుంటున్నారు. కానీ నేను మంచి టెస్ట్ బ్యాటర్‌ని. ఈ విషయాన్ని చాలా రోజులుగా చెబుతున్నా. శరీరానికి దగ్గరగా ఆడటం నాకు చాలా ఇష్టం. ఇలా ఆడటం సవాల్‌గా ఉంటుంది.'అని తిలక్ వర్మ తెలిపాడు. హాంప్‌షైర్ తరఫున అతను నాలుగు మ్యాచ్‌లు ఆడనున్నాడు.


# ధనుష్ ..మీరెంత మంచి వారో

## ప్రశంసలతో పోస్ట్ చేసిన రష్మిక



కోలీవుడ్ స్టార్ ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రలో, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందించిన తాజా చిత్రం 'కుబేర' సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న కుబేర.. మంచి వసూళ్లతో సత్తా చాటుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అదిరిపోయే కలెక్షన్లు రాబడుతోంది. ఈ మూవీ ద్వారా నాగ్ లో కొత్తకోణం కనిపించింది. ఇక ధనుష్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు అయితే ఫిదా అయ్యారు. ఇందులో సమీరా పాత్రలో నటించిన రష్మిక కూడా ప్రేక్షకులను మెప్పించింది. అయితే తాజాగా తన కోస్టార్ ధనుష్ గురించి ఒక ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది రష్మిక. 'మీతో అంత పెద్ద సినిమా చేసినప్పటికీ మనిద్దరిది ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మీరు అద్భుతమైన వ్యక్తి, మనం మట్లాడుకున్న ప్రతిసారీ వేర్వేరు నగరాల్లో ఉన్నాం. ఇద్దరం వేర్వేరు పనులు చేసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించేవాళ్లం. కానీ, విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. కుబేర నటనపరంగానే కాదు.. నిజ జీవితంలోనూ మీరు చేసే పనులు ఎంతోమందికి ఆదర్శం. చుట్టూ ఉన్న వారితో ఎంతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటారు. ముఖ్యంగా మీరు సెట్‌ల్లో నాకోసం తెచ్చిన లడ్డులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాకు తమిళ డైలాగుల్లో మీరు చేసిన సహాయం.. నేను ఏదైనా డైలాగ్ చెప్పినప్పుడు మీరు ప్రశంసించిన తీరు. ఇవన్నీ చిన్న చిన్న విషయాలు కావచ్చు. కానీ, జీవితమంతా గుర్తుంటాయి' అంటూ ధనుష్ దిగిన సెల్ఫీ ని షేర్ చేశారు రష్మిక. తాజాగా రష్మిక మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# హిందీలో మజ్దూర్‌గా వస్తున్న రజనీకాంత్



తలైవా రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా ఇది. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. అగ్ర నటులు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహిర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగష్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి తాజాగా హిందీలో టైటిల్‌ను మార్చారు మేకర్స్. హిందీలో ఈ సినిమాను 'మజ్దూర్' అనే పేరుతో తీసుకురాబోతున్నట్లు సమాచారం. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు అని అర్థం. అయితే కూలీ అనే టైటిల్ బాగానే ఉన్నప్పటికి పేరు మార్చడంపై చాలా మంది నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గతంలో వచ్చిన అమితాబ్ బచ్చన్ కూలీ (1983), గోవిందా కూలీ నెం. 1 (1995), వరుణ్ ధావన్ కూలీ నెం. 1 (2020) వంటి చిత్రాల కాపీరైట్ సమస్యల వల్లే ఈ పేరు మార్పు జరిగిందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.





# మీనాకుమారి బయోపిక్‌లో కియారా అద్వానీ

బాలీవుడ్‌లో మళ్లీ బయోపిక్‌ల ట్రెండ్ జోరుగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మరో బయెపిక్ తెరమీదకి రాబోతుంది. దివంగత నటి, 'ట్రాజెడీ క్వీన్' గా ప్రసిద్ధి చెందిన మీనా కుమారి జీవితం ఆధారంగా ఒక బయోపిక్ రాబోతున్నట్లు తెలుస్తుండగా.. ఈ చిత్రంలో కియారా అద్వాణీ మీనాకుమారి పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అలనాటి 'ట్రాజెడీ క్వీన్' మీనా కుమారి గురించి సినీ ప్రియులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'బైజుబాన్రా', 'పాకీజా' వంటి క్లాసిక్ చిత్రాలతో భారతీయ సినిమా చరిత్రలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు మీనా కుమారి. ఆమె జీవితంలో దాగి ఉన్న భావోద్వేగాలు, బాధలు, కీర్తి, ప్రేమ.. ఇలా అన్నీ వెండితెరపై మరోసారి ప్రతిభావంతంగా ఆవిష్కరించేందుకు బాలీవుడ్ సిద్ధమవుతోంది. ఈ భారీ బయోపిక్‌కు ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించబోతున్నట్లు సమాచారం. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మనీష్, ఇప్పుడు సినిమా దర్శకత్వంలో అరంగేట్రం చేయనుండగా, ఆయన తొలి చిత్రమే 'మీనా కుమారి' బయోపిక్ కావడం విశేషం. తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రతిష్టాత్మక బయోపిక్‌లో కియారా అద్వాణీనే కథానాయికగా ఎంపికైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మీనా కుమారి పాత్రలో నటించేందుకు పలువురు హీరోయిన్‌లు ఆసక్తి చూపినప్పటికీ, ఆ పాత్రకు అవసరమైన భావోద్వేగం, విలువ, గంభీరత కియారా నుంచే రావచ్చని చిత్ర బృందం బలంగా నమ్ముతోందట. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశలో ఉన్నాయని, దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని కియారా సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

# అనుపమ మూవీకి సెన్సార్ కష్టాలు

మలయాళ నటులు అనుపమ పరమేశ్వరన్, కేంద్రమంత్రి సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను కాస్మోస్ ఎంటర్‌టైనమెంట్స్ నిర్మిస్తుండగా.. శృతి రామచంద్రన్, మాధవ్ సురేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూన్ 27 ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ అభ్యంతరం వలన సినిమా వాయిదా పడినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో బాధితురాలి పాత్రకు జానకి అని దైవ సంబంధమైన పేరుని పెట్టడంపై ముంబై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో జానకి అనే పేరుతో ఓ మహిళ అత్యాచార బాధితురాలిగా న్యాయ-పోరాటం చేస్తుందని, అయితే 'జానకి' అనేది సీతాదేవికి మరో పేరు కావడంతో, అలాంటి పేరును అత్యాచార బాధితురాలికి పెట్టకూడదని సెన్సార్ బోర్డు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందిస్తూ, జూన్ 27న విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడిందని ధృవీకరించారు. ఈ నిర్ణయంపై మలయాళ సినీ పరిశ్రమలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్నికృష్ణన్ సెన్సార్ బోర్డు నిర్ణయాన్ని విమర్శించారు. దేవుళ్ల పేర్లు కలిగిన పాత్రలకు ఇటువంటి నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందని, ఇది కళాత్మక స్వేచ్ఛను అడ్డుకుంటుందని ఆయన అన్నారు. ఇలాంటి నిబంధనలు ఉంటే, హిందూ మతానికి చెందిన పాత్రలకు పేర్లు ఎంపిక చేసుకోవడం చాలా కష్టమవుతుందని ఆయన ప్రశ్నించారు. తిరువనంతపురంలోని ప్రాంతీయ సెన్సార్ కార్యాలయం ఈ చిత్రానికి ఉ/ం సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, ముంబైలోని ప్రధాన కార్యాలయం ఈ టైటిల్‌ను మార్చాలని డిమాండ్ చేయడంతో ఈ సమస్య తలెత్తింది. పేరు మార్చాల్సి వస్తే, సినిమాలోని అనేక సంభాషణలను కూడా మార్చాల్సి వస్తుందని మేకర్స్ ఆందోళన చెందుతున్నారు.

# విజయ్ లవ్‌లో త్రిష ...అంటూ పుకార్లు



ఓ స్టార్ హీరోతో హీరోయిన్ త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి. సదరు హీరోతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో త్రిష పంచుకుంటూ బర్త్‌డే విషెస్ తెలియజేయడం, అదే ఫొటోను ఆమె తల్లి షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీ జోడించడం అందుకు కారణం. ఆ రూమర్స్‌పై త్రిష పరోక్షంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రేమపై పోస్టు పెట్టారు. పూర్తిగా ప్రేమలో మునిగిపోతే, అది కొందరిని తికమక చేస్తుందని పేర్కొన్నారు. తాజాగా కోలీవుడ్ హీరోయిన్ త్రిష చేసిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో రచ్చకు కారణమైంది. జూన్ 22న విజయ్ బర్త్ డే సందర్భంగా హ్యాపీ బర్త్ డే బెస్టెస్ట్ అని హగ్ సింబల్ జత చేసి విజయ్ తో పక్క పక్కనే కూర్చున్న పిక్ షేర్ చేసింది త్రిష. అంతేనా ఈ ఫోటోకు త్రిష తల్లి సైతం లవ్ సింబల్స్ జోడించి ఇన్ స్టా స్టోరీ పెట్టింది. దాంతో త్రిష, విజయ్ మధ్య లవ్ అఫైర్ ఉందని నెటిజన్స్ వీరిని లవర్స్ గా కన్ఫామ్ చేసారు. ఈ ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారని చాలా కాలం వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఈ ఇద్దరు ఎప్పుడు వాటిని ఖండించలేదు. విజయ్ అండ్ త్రిష లవ్ బర్డ్స్ అంటూ ఇప్పటి నుండే కాదు.. ఎప్పటి నుండో గాసిప్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇద్దరూ కలిసి జర్నీ చేయడం, కీర్తి సురేష్ పెళ్లికి గోవా వెళ్లడం కూడా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని కన్ఫర్మ్ చేస్తున్నారు నెటిజన్లు. రీసెంట్లీ గుడ్ పీపుల్, గుడ్ టైమ్స్ అంటూ ఓ పోస్ట్ పెట్టింది త్రిష. బర్త్ డే రోజు విజయ్ కుక్క పిల్లని ఎత్తుకున్న ఫోటో షేర్ చేసింది. కుక్క పిల్లను ఈ ఏడాదే ఫిబ్రవరిలో త్రిష దత్తత తీసుకుంది. అంటే ఆ ఫోటో రీసెంట్ గా తీసుకుంది. ఇద్దరు కలిసి త్రిష ఇంట్లో పార్టీ చేసుకున్నారన్న టాక్ నడుస్తోంది. త్రిష, విజయ్ 2004లో గిల్లీ సినిమాలో తొలిసారి జతకట్టారు. 2006లో ఆదితో పాటు రీసెంట్లీ లియోలోను కలిసి నటించారు. తన 25 సంవత్సరాల కెరీర్లో ఇప్పటి వరకు స్పెషల్ సాంగ్ చేయని త్రిష గోట్‌లో విజయ్ కోసం నర్తించింది. దీంతో ఈ ఇద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ అనే చర్చకు బలం చేకూరింది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463